ఈనాటి
PRGI-NO-APTEL/25/A2739
# తెలుగోడు
EENAATI TELUGODU... Telugu Daily
https://www.eenaatitelugodu.com
సంపుటి-1 | సంచిక - 78 | బుధవారం 17 డిసెంబర్ 2025 | పేజీలు - 8 | వెల - రూ.. 5
Published From - Vijayawada, Anantapur, Sri Satyasai, Kurnool, Nandyala, Kadapa, Annamayya, Srikakulam, Nellore, chittoor, Tirupati

సంజన లైఫ్‌కేర్ ఫార్మసీ +




మా వద్ద అన్ని రకాల ప్రముఖ కంపెనీల మందులు లభించును..
ఎమ్మార్పీ ధరలకంటే ప్రతి మెడిసిన్‌పై 10శాతం నుండి 30శాతం వరకు ధర తగ్గించి అమ్మబడును..
అత్యవసర పరిస్థితిలో డోర్ డెలివరీ కూడా ఇవ్వబడును...
బస్టాండ్ సర్కిల్, మెయిన్‌రోడ్, నల్లమాడ.. శ్రీ సత్యసాయి జిల్లా..
సెల్ - 8886920715



## వైద్య ఆరోగ్య రంగం ప్రాణాలు నిలిపే
# సంజీవని

**ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశిత లక్ష్యాల సాధన...**

**వైద్యారోగ్య రంగంలో ప్రమాణాలకు పెద్దపీట..**

**ప్రజల జీవన ప్రమాణాలు పెంచే యత్నం..**

**వైద్య ప్రముఖులతో చంద్రబాబు వీడియో కాన్ఫరెన్స్..**

**అమరావతి, డిసెంబర్ 16 :**

పేద ప్రజల ప్రాణాలు నిలిపేలా వైద్య ఆరోగ్య రంగం వుండాలని సిఎం చంద్రబాబు సూచించారు. వైద్యారోగ్య రంగంలో వివిధ ప్రమాణాలను అందుకునేలా ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశించిన సూచనలను అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. 2047 స్వర్ణాంధ్రప్రదేశ్ లక్ష్యాల ద్వారా అంతిమంగా ప్రజల జీవన ప్రమాణాలు పెంచేలా ప్రయత్నాలు చేస్తున్నామని వెల్లడించారు. ఆరోగ్య సమస్యల కోసం యోగాతో పాటు నేచురోపతిని ప్రోత్సహించాల్సి ఉందని అన్నారు. మంగళవారం సచివాలయంలో వైద్యారోగ్య రంగంలో అత్యున్నత స్థాయి నిపుణుల సలహా బృందంతో సీఎం చంద్రబాబు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పౌరులకు

(మిగతా 2లో)

## కూటమి ప్రభుత్వం అధికార
# దుర్వినియోగం

**42 కుటుంబాలను రోడ్డున పడేసిన కూటమి ప్రభుత్వం..**

**న్యాయ స్థానంలో ఊరట ఉన్నప్పటికీ అధికార దుర్వినియోగం..**

**25 ఏళ్లుగా 42 కుటుంబాలు మున్సిపల్ కార్పొరేషన్ అనుమతితో ఇళ్లు కట్టుకున్నారు..**

**భవానీ నగర్‌లో బాధిత కుటుంబాల పరామర్శలో జగన్...**



**విజయవాడ, డిసెంబర్ 16 :**

న్యాయస్థానంలో ఊరట ఉన్నప్పటికీ.. అధికార దుర్వినియోగంతో కూటమి ప్రభుత్వం 42 కుటుంబాలను అన్యాయంగా రోడ్డున పడేసిందని వైఎస్సార్సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం భవానీపురం జోజి నగర్లో బాధిత కుటుంబాలను కలిసి పరామర్శించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు."25 ఏళ్లుగా 42 కుటుంబాలు ఇక్కడే ఇళ్లు కట్టుకుని జీవిస్తున్నాయి. మున్సిపల్ కార్పొరేషన్ అనుమతి కూడా ఉంది. అయినా కూడా వీళ్ల ఇళ్లను ధ్వంసం చేశారు. సుప్రీం కోర్టులో ఈ పిటిషన్ పెండింగ్లో ఉంది. ఈ నెల 31వ తేదీ వరకు సుప్రీం కోర్టు వీళ్లకు ఊరట ఇచ్చింది. పోలీసులు ప్రైవేట్ పార్టీకి మద్దతుగా ఈ కూల్చివేతలు జరిపారు. 200 మంది పోలీసులు ఈ కూల్చివేతలు జరిపారు. ప్రైవేట్ వ్యక్తులకు లబ్ధి చేసేందుకు ప్రభుత్వ పెద్దల ప్రమేయంతోనే ఈ కూల్చివేతలు జరిగాయి. అధికార దుర్వినియోగం చేస్తూ ఇక్కడి వాళ్లను రోడ్డుపాలు చేశారు" అని వైఎస్ జగన్ ధ్వజమెత్తారు. 2.17 ఎకరాల ఈ భూమి విలువ రూ. 150 కోట్ల దాకా ఉంటుంది. 2016లో ఫేక్ సొసైటీ క్రియేట్ చేశారు. అప్పటి నంచే ఈ భూమిని కాజేసేందుకు స్కెచ్ వేశారు. కూల్చివేతల్లో విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని, జనసేన కార్పేటర్ సోదరుడి ప్రమేయం కూడా ఉంది. బాధితులు చంద్రబాబును మూడుసార్లు కలిశారు. లోకేష్ను రెండు సార్లు కలిశారు. ఆ ఇద్దరికీ వినతి పత్రాలు ఇచ్చారు. అయినా కూడా కుట్రపూరితంగా.. చంద్రబాబు, లోకేష్, చిన్నిలు బాధితులకు అన్యాయం చేశారు. బుల్డోజర్లతో మధ్యతరగతి కుటుంబాలను విచ్ఛిన్నం చేశారు" అని వైఎస్ జగన్ ఆవేదన

(మిగతా 2లో)

# ఆరోగ్య వ్యవస్థలో మార్పులు

**నిపుణుల ఆలోచనలకు అనుగుణంగా మార్పులు..**

**ఆరోగ్య వ్యవస్థని పటిష్టత చేసే యోచనలో ముందుకి**

**కోటి సంతకాల రాద్ధాంతం ఇది కోడి గీతల కార్యక్రమం**

**కార్యకర్తలకు సంతకాలు పెట్టి చేతులన్నీ వాపులు..**

**మంత్రి సత్యకుమార్...**



**అమరావతి, డిసెంబర్ 16 :**

రాష్ట్ర ఆరోగ్య వ్యవస్థలో మార్పు తీసుకురావడం జరుగుతుందని మంత్రి సత్య కుమార్ యాదవ్ తెలిపారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. 10 వ్యాధులను మ్యాపింగ్ చేసి ఎక్స్‌పర్ట్స్ ఆలోచనలకు అనుగుణంగా ట్రీట్‌మెంట్ చేయటం జరుగుతుందని వెల్లడించారు. జాతీయ, అంతర్జాతీయ ఎక్స్‌పర్ట్స్‌తో ఉండే శాస్త్రవేత్తలు ఈ గ్రూప్‌లో ఉన్నారని తెలిపారు. దేశ విదేశాలలో ఉన్న ఈ సైంటిస్ట్‌లు వర్చువల్ విధానంలో మొదటి సమావేశానికి హాజరయ్యారన్నారు. వ్యక్తిగత చికిత్స అందించేందుకు ప్రతిష్టాత్మకంగా ఈ ఎక్స్‌పర్ట్స్ గ్రూప్ పనిచేస్తుందని అన్నారు. ఆరోగ్య వ్యవస్థని పటిష్టత చేసే యోచనలో ముందుకి వెళ్తున్నామని వెల్లడించారు. రాబోయే రోజుల్లో ఫీల్డ్ విజిట్ చేయటం జరుగుతుందని మంత్రి తెలిపారు. ఇక.. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైసీపీ చేపట్టిన కోటి సంతకాల సేకరణపై మంత్రి స్పందించారు. కోటి సంతకాల రాద్ధాంతం మొదలైందని.. ఇది కోడి గీతల కార్యక్రమం అంటూ ఎద్దేవా చేశారు. సుపరిపాలన యాత్రలో ఎవరు కూడా కోటి సంతకాల కార్యక్రమంలో పాల్గొనలేదని తెలియజేశారు. లక్షల మందిలో కనీసం ఒక్కరు కూడా సంతకం చేసిన దాఖలు

(మిగతా 2లో)

# ఎలాన్‌మస్క్ సరికొత్త రికార్డు
## 600ల బిలియన్ డాలర్ల క్లబ్‌లోకి

**న్యూ యార్క్, డిసెంబర్ 16 :**

అమెరికన్ టైకూన్, ప్రపంచ కుబేరుడు, టెస్లా అధినేత ఎలాన్ మస్క్ సరికొత్త రికార్డును నెలకొల్పారు. వ్యక్తిగత సందప పరంగా మస్క్ ఏకంగా 600 బిలియన్ డాలర్ల క్లబ్‌లోకి చేరారు . తద్వారా ప్రపంచంలోనే తొలిసారి ఈ రికార్డు నెలకొల్పిన వ్యక్తిగా మస్క్ చరిత్ర సృష్టించారు. మస్క్ స్థాపించిన అంతరిక్ష సంస్థ స్పేస్‌ఎక్స్ విలువ 800 బిలియన్ డాలర్లకు చేరుకుని, ఐపీఓగా వచ్చే అవకాశం ఉందనే వార్తల నేపథ్యంలో ఆయన సంపద ఈ స్థాయికి పెరగడం విశేషం. వచ్చే ఏడాది స్పేస్‌ఎక్స్ పబ్లిక్‌లోకి వెళ్లడానికి సిద్ధమవుతోందని రాయిటర్స్ వార్తాసంస్థ గత వారం నివేదించిన విషయం తెలిసిందే. స్పేస్‌ఎక్స్‌లో మస్క్‌కు దాదాపు 42శాతం వాటా ఉంది. ఈ సంస్థ వాల్యూ పెరగడంతో మస్క్ సంపద కూడా వృద్ధి చెందింది. ఒక్క రోజులోనే 168 బిలియన్ డాలర్లు పెరిగి సోమవారం మధ్యాహ్నం సమయానికి మస్క్ నికర సంపద దాదాపు 677 బిలియన్ డాలర్లకు చేరినట్లు ఫోర్బ్స్ వెల్లడించింది. ఇక ఈ ఏడాది అక్టోబరులో మస్క్ నికర సంపద 500 బిలియన్ డాలర్లు దాటిన సంగతి తెలిసిందే. 2022లో మస్క్ సంపద 200 బిలియన్ డాలర్ల కంటే దిగవుకు పడిపోయింది. ఆ తర్వాత మస్క్ సంపద పెరుగుతూ వస్తోంది. ఈ మూడేళ్లలోనే మస్క్ సంపద 600 బిలియన్ డాలర్లు దాటడం విశేషం. ఇప్పటివరకు ప్రపంచంలో ఏ కుబేరుడు ఈ స్థాయిలో సంపదను ఆర్జించలేదు. మరోవైపు కార్పొరేట్ చరిత్రలోనే అత్యధిక జీతం అందుకుంటున్న సీఈవోగా మస్క్ రికార్డు క్రియేట్ చేశారు.

(మిగతా 2లో)



# గాంధీ అంటే మోడీకి నచ్చదు

**ఎన్ ఆర్ ఈజీ రద్దుతో పేదల ఉపాధికి పెద్ద దెబ్బ..**

**ఉద్యోగాలు ఇవ్వకుండా..ఉపాధి కూడా ఎత్తేస్తారా..**

**కేంద్రం తీరుపై మండిపడ్డ విపక్షనేత రాహుల్...**

**పార్లమెంట్ వరకు నిరసనలు తెలుపుతామని వెల్లడి..**



**న్యూ ఢిల్లీ, డిసెంబర్ 16 :**

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం చట్టాన్ని రద్దు చేస్తూ దాని స్థానంలో కేంద్రం కొత్త చట్టాన్ని తీసుకురావడానికి బిల్లు ప్రవేశపెట్టడాన్ని విపక్ష కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ విమర్శించారు. మహాత్మా గాంధీ ఆదర్శాలను అవమానించమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఈ చర్యలు తీసుకుంటోందని దుయ్యబట్టారు. ఉద్యోగాలు ఇవ్వకుండా యువత భవిష్యత్తును నాశనం చేసిన మోదీ ప్రభుత్వం..ఇప్పుడు గ్రామీణ ప్రజలకు కూడా ఉపాధి లేకుండా చేస్తోందని మండిపడ్డారు. ఈ ప్రజా వ్యతిరేక బిల్లుకు వ్యతిరేకంగా ప్రతిపక్షాలు ర్యాలీగా పార్లమెంటు వరకు వెళ్లి తమ నిరసనను తెలియజేస్తాయన్నారు. మహాత్మా గాంధీ ఆలోచనలు, పేదల హక్కులపై ప్రధాని మోదీకి ముందు నుంచి తీవ్రమైన అయిష్టత ఉంది. గ్రామ స్వరాజ్యాన్ని తీసుకురావాలనే గాంధీ ఆలోచనకు ఎంజీ నరేగా ఓ సజీవ స్వరూపం. ఎన్నో ఏళ్లుగా ఇది లక్షలాది మంది గ్రామీణ ప్రజలకు జీవనాడిగా ఉంది. కొవిడ్ సమయంలో కూడా ఈ పథకం పేదలకు ఆర్థిక భద్రతను ఇచ్చింది. కాంగ్రెస్ తీసుకువచ్చిన ఎంజీ నరేగా ప్రధాని మోదీని ఎప్పుడూ కలవరపెడుతూనే ఉంది. కాబట్టి దీనిని బలహీనపరిచేందుకు కేంద్ర ప్రభుత్వం పదేళ్లుగా ప్రయత్నిస్తోంది. అందులో భాగంగానే దీనిని పూర్తిగా తుడిచిపెట్టేందుకు చర్యలు తీసుకుంటున్నారని రాహుల్ సోషల్ మీడియాలో రాసుకొచ్చారు. ప్రస్తుతం ఉన్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం స్థానంలో కేంద్రం కొత్త బిల్లును తీసుకురావాలని యోచిస్తున్న

(మిగతా 2లో)

## నేటి నుంచి శ్రీవారి ఆలయంలో
# తిరుప్పావై సేవ



**తిరుమల, డిసెంబర్ 16 :**

ధనుర్మాసం సందర్భంగా తిరుమల శ్రీవారి అలయంలో సుప్రభాత సేవ బదులు తిరుప్పావై పాశురాలను ప్రవచిస్తారు. వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం నుంచి నెల రోజుల పాటు సుప్రభాత సేవ రద్దు చేస్తున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని భక్తులు గమనించాలని సూచించారు. ఈమేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. బుధవారం నుంచి తిరుప్పావై పాశురాలతో శ్రీవారికి మేలుకొలుపు జరుపుతున్నట్లు వివరించారు. శ్రీవల్లి పుత్తూరు చిలుకలతో రోజూ స్వామి వారికి అలంకరణ చేస్తున్నట్లు తెలిపారు. శ్రీవారికి విశేష నైవేద్యాలుగా బెల్లం దోశ, శొండెలు, సీరా, పొంగల్ వంటి ప్రత్యేక ప్రసాదాలు నివేదన చేస్తున్నట్లు వివరించారు. భోగశ్రీనివాస మూర్తికి బదులుగా శ్రీకృష్ణస్వామి వారికి ఏకాంతసేవ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

# రెవెన్యూ శాఖలో ప్రక్షాళన

**దశాబ్దాలుగా రెవెన్యూ శాఖపై అవినీతి ముద్ర..**

**వ్యవస్థాగత లోపాలతో తప్పించుకుంటున్న అక్రమార్కులు**

**కీలక బాధ్యతలు తహశీల్దార్‌లకు అప్పగించే యోచన..**

**ఆర్డీవోలకు మ్యుటేషన్ల సవరణ, పలు మార్పుచేర్పుల బాధ్యతలు..**



**అమరావతి, డిసెంబర్ 16 :**

ఏపీలో గత వైసీపీ ప్రభుత్వంలో వ్యవస్థలు ధ్వంసం అయ్యాయంటూ ఆరోపణ లు చేసి అధికారంలోకి వచ్చిన కూటమి పార్టీలు.. వచ్చీ రాగానే ప్రక్షాళన బాట పట్టాయి. ఇందులో భాగంగా ఇప్పటికే గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థతో పాటు పలు శాఖల్లో ప్రక్షాళన చేపట్టారు. ఇదే క్రమంలో ఇప్పుడు కీలకమైన రెవెన్యూ శాఖలో ప్రక్షాళన చేపట్టేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. త్వరలో దీనిపై మార్గదర్శకాలు వెలువడే అవకాశ ముంది. రాష్ట్రంలో ఎంతో కీలకమైన రెవెన్యూశాఖపై దశాబ్దాలుగా అవినీతి ముద్ర కూడా అదే స్థాయిలో ఉంటోంది. ప్రభుత్వాలు మారుతున్నా వ్యవస్థాగత లోపాల కారణంగా అక్రమార్కులు తప్పించుకుంటూనే ఉన్నారు. ఈ నేపథ్యంలో ఈసారి రెవెన్యూ శాఖలో భారీ ప్రక్షాళన చేపట్టాలని, తద్వారా లోపాల్ని సరిదిద్దాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. దీనిపై ఇప్పటికే అంతర్గత చర్చల్లో ఓ క్లారిటీకి కూడా వచ్చినట్లు సమాచారం. తాజా అంచనాల ప్రకారం రెవెన్యూశాఖలో ఇకపై కీలక బాధ్యతలు తహసీల్దార్లకు అప్పగించే అవకాశాలు కనిపిస్తున్నాయి. వీరికి వెబ్ ల్యాండ్ లో రైతుల ఆధార్ నంబర్ల సవరణ, భూకేటాయింపు, భూసేకరణ, కోర్టు ఉత్తర్వు అమలు వంటి కీలక బాధ్యతలు అప్పగిస్తారని తెలుస్తోంది. అలాగే ఆర్డీవోలకు మ్యుటేషన్ల సవరణ, ఎల్పీఎం నంబర్లలో సమస్యలు చక్కదిద్దే బాధ్యత అప్పగించే అవకాశం ఉంది. ప్రభుత్వ భూముల్ని పట్టా భూములుగా మార్చే అధికారం మాత్రం జాయింట్ కలెక్టర్ల వద్దే ఉంచాలని ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్రంలో భూవివాదాల

(మిగతా 2లో)

# ప్రాణాలు నిలిపే సంజీవని

(మొదటి పేజీ (తరువాయి)

సంబంధించిన డిజిటల్ హెల్త్ రికార్డులను సంజీవని ప్రాజెక్టు ద్వారా రూపొందిస్తున్నామని ఈ సందర్భంగా సీఎం తెలిపారు. గేట్స్ ఫౌండేషన్ సహకారంతో కుప్పం, చిత్తూరు జిల్లాల్లో డిజిటల్ నెర్వ్ సెంటర్ ద్వారా ఈ వివరాలను సేకరించి ఇంటిగ్రేట్ చేశామన్నారు. రియల్ టైమ్‌లోనే వారి వివరాలు తెలుసుకునేలా సంజీవని ద్వారా ఇంటిగ్రేట్ చేస్తున్నామని చెప్పారు. వివిధ అంశాల్లో పౌరులకు సంబంధించిన ఆరోగ్య సమాచారం అందుబాటులో ఉంటుందన్నారు. ప్రివెంటివ్ వెల్ నెస్, డిజిటల్ ఏఐ ఎనేబుల్డ్ హెల్త్, హెల్త్÷నాన్సింగ్ రిఫార్మ్స్ లాంటి కీలకమైన అంశాలపై దృష్టి పెట్టాలని సూచించారు. వైద్యారోగ్య రంగంలో మౌలిక సదుపాయాలు పెద్ద ఎత్తున పెరగాలన్నారు. ఏపీలో మెడ్ టెక్ పార్కు ద్వారా అధునాతన వైద్య పరికరాలను రూపొందిస్తున్నామని సీఎం తెలిపారు. రోగం వచ్చిన తర్వాత తీసుకునే జాగ్రత్తల కంటే ఆ జబ్బు రాకుండా ముందస్తుగానే నియంత్రించేలా ప్రివెంటివ్ టెక్నాలజీస్‌పై దృష్టి పెట్టాలని సూచనలు చేశారు. తద్వారా వైద్యారోగ్యంపై వ్యయాన్ని గణనీయంగా తగ్గించే అవకాశం ఉంటుందన్నారు. వైద్యారోగ్య రంగంలో మరింత వినూత్నంగా ప్రాజెక్టులు చేపట్టేందుకు అత్యున్నత స్థాయి ఎక్స్‌పర్ట్ గ్రూప్ సలహాలు ఇవ్వాలని కోరుతున్నామన్నారు. ప్రతీ రంగంలోనూ టెక్నాలజీ ద్వారా అత్యుత్తమ ప్రమాణాలు తీసుకుని రావాలన్నదే తమ లక్ష్యమని స్పష్టంచేశారు. సామర్థ్యాల పెంపుతో పాటు ప్రజలకు అత్యున్నత సేవలు అందాలన్నారు. క్వాంటం, ఏఐతో రియల్ టైమ్ డేటా విశ్లేషణ లాంటి వాటి ద్వారా ప్రజలకు సేవలు అందాలని చెప్పారు. ప్రస్తుతం ఏఐ ద్వారా నాలెడ్జి వ్యవస్థీకృతం అయ్యిందన్నారు. గ్లోబల్ కమ్యూనిటీకి సేవలు అందించేలా ప్రస్తుతం అంతా సామర్థ్యాలను పెంచుకోవాల్సి ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. కాగా... అత్యున్నత స్థాయి నిపుణుల సలహా బృందంలో యూఎస్ ఏఐడీఎస్ ప్రతినిధి పీటర్ పాయిట్, డబ్ల్యూహెచ్‌వో సైంటిస్ట్ సౌమ్య స్వామినాథన్, ఎఐజీ చైర్మన్ డి.నాగేశ్వర్ రెడ్డి, సింగపూర్ ప్రతినిధి ప్రొఫెసర్ ఇక్ ఇంగ్ టియో, ఆర్తి అహుజా, రిజ్వాన్ కొయిటా, శ్రీకాంత్ నాదముని, గగన్ దీప్ కాంగ్, మార్గరెట్ ఎలిజిబెత్, నిఖిల్ టాండన్, ఇతర వైద్య నిపుణులు ఉన్నారు. ఈ సమావేశంలో మంత్రి సత్యకుమార్ యాదవ్, వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులు, గేట్స్ ఫౌండేషన్ కంట్రీ డైరెక్టర్ అర్చనా వ్యాస్ తదితరులు పాల్గొన్నారు.

# గాంధీ అంటే మోడీకి నచ్చదు

(మొదటి పేజీ (తరువాయి)

సమయంలో, కేంద్ర ప్రభుత్వంపై ప్రతిపక్ష ఎంపీ రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఇది మహాత్మాగాంధీ ఆదర్శాలకు అవమానమని అన్నారు. గ్రామీణ కుటుంబాలకు ప్రతీ ఏడాది 100 రోజుల వేతన ఉపాధికి చట్టపరమైన హామీని అందించే పథకాన్ని రద్దు చేయాలని మోడీ సర్కార్ యోచిస్తోందని మండిపడ్డారు. కేంద్రం కొత్తగా రోజ్‌గార్ అజీవిక మిషన్ బిల్లు, 2025ను తీసుకురావడంపై ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ప్రధాని మోడీకి రెండు విషయాలు నచ్చవని, మహాత్మాగాంధీ ఆలోచనలు, పేదల హక్కులు నచ్చవని ఎక్స్‌లో ఆరోపించారు. కేంద్రం తీసుకురాబోతున్న కొత్త బిల్లుకు వ్యతిరేకంగా ప్రతిపక్షాలు రోడ్ల నుంచి పార్లమెంట్ వరకు నిరసన తెలుపుతాయని ఆయన అన్నారు. కొత్త బిల్లు మహాత్మా గాంధీ ఆదర్శాలకు అవమానమని, నిరుద్యోగం ద్వారా భారత దేశ యువత భవిష్యత్తును నావనం చేసిన తర్వాత, మోడీ ప్రభుత్వం ఇప్పుడు గ్రామీన పేదల జీవనోపాధిని లక్ష్యంగా చేసుకున్నారని అన్నారు. ఉపాధి హామీ పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం 2005లో తీసుకువచ్చింది.

# ధ్వజ స్థంభాలకై  దివ్య వృక్షాల వనం

## పలమనేరులో వంద ఎకరాల్లో పెంపకం
## టీటీడీలోని 31 విద్యాసంస్థల్లో డిజిటల్ క్లాస్ రూమ్‌లు ఏర్పాటు
## పద్మావతి చిన్న పిల్లల ఆస్పత్రి నిర్మాణానికి అదనంగా రూ.48 కోట్లు
## ముంబాయిలోని బాంద్రాలో రూ.14.4 కోట్లతో ఆలయ నిర్మాణం
## అలిపిరి వద్ద 20 ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ టౌన్ షిప్
## జగిత్యాల జిల్లా కొండగట్టులో వసతిగృహాల నిర్మాణం
## టిటిడి ధర్మకర్తల మండలి సమావేశంలో కీలక నిర్ణయాలు



**తిరుమల, డిసెంబర్ 16 :**

దేశంలోనీ అన్ని ఆలయాలకు టీటీడీ నుంచి ధ్వజస్థంభాలు ఇవ్వడానికి 100 ఎకరాల్లో ఉద్యానవణం ఏర్పాటు చేయాలని టీటీడీ పాలక మండలి సమావేశంలో నిర్ణయించారు. టిటిడి ఆలయాలకు ధ్వజస్తంభం, రథాలు తయారు చేసేందుకు పలమనేరులో 100 ఎకరాలలో దివ్య వృక్షాలు పెంచేందుకు నిర్ణయం తీసుకున్నారు. టీటీడీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు బీఆర్ నాయుడు అధ్యక్షతన మంగళవారం తిరుమల అన్నమయ్య భవనంలో ధర్మకర్తల మండలి సమావేశం జరిగింది. ఇందులో ముఖ్య నిర్ణయాలు ఇలా ఉన్నాయి. సమావేశం అనంతరం పాలకమండలి సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను చైర్మన్ బీఆర్ నాయుడు మీడియా సమావేశంలో వివరించారు. పద్మావతి చిన్న పిల్లల ఆస్పత్రి నిర్మాణానికి అదనంగా రూ.48 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. టీటీడీలోని 31 విద్యా సంస్థల్లో డిజిటల్ క్లాస్ రూమ్‌లు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ముంబాయిలోని బాంద్రాలో రూ.14.4 కోట్లతో ఆలయ నిర్మాణం చేపడతామని.. అలిపిరి వద్ద 20 ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ టౌన్ షిప్ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. టౌన్ షిప్‌లో వసతి సదుపాయంతో పాటు అన్నప్రసాద సముదాయం, ఇతర వసతులు భక్తులకు కల్పిస్తామని అన్నారు. కాటేజ్ డోనార్ స్కీంలో మార్పులకు ఆమోదం తెలిపామన్నారు. పద్మావతి కాలేజీలో అదనంగా 270 సీట్లు పెంచుతూ నిర్ణయం తీసుకున్నామని.. . టీటీడీలోని నాలుగు కేటగిరిలలోని 60 పోస్టులను త్వరలోనే భర్తీ చేయనున్నట్లు ప్రకటించారు. తిరుపతిలోని పలు రోడ్ల అభివృద్ధికి నిధులు కేటాయించినట్లు తెలిపారు. శ్రీవారి పోటులో 18 సూపర్‌వైజ్ పోస్టుల భర్తీకి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. తిరుమలలోని వీధులకు పేర్లు పెట్టేందుకు కమిటీ నియామకం జరిగిందన్నారు. టీటీడీలోని కాలేజ్‌లలో మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తామన్నారు. టీటీడీ అనుబంధ ఆలయాల్లోని 62 మంది పరిచారక, అర్చకులు జీతాలు పెంచుతూ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అదనంగా ఓ సన్నిధి గొల్ల నియమానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. కాలిబాటలో అనుభవమున్న 18 మంది అధికారుల నియామకానికి ఆమోదం తెలిపినట్లు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు పేర్కొన్నారు. తిరుపతి జిల్లా తలకోనలోని శ్రీ సిద్దేశ్వర స్వామివారి ఆలయ పునః నిర్మాణ పనులలో భాగంగా రెండవ దశలో రూ.14.10 కోట్లు మంజూరుకు నిర్ణయించారు. తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ కళాశాలలో ప్రస్తుతం ఉన్న 2100 హాస్టల్ సీట్లకు అదనంగా మరో 270 హాస్టల్ సీట్లు పెంచాలని నిర్ణయించారు. టిటిడి ఇంజనీరింగ్ విభాగంలో నాలుగు కేటగిరిలలో ఖాళీగా ఉన్న 60 పోస్టులకు ఇప్పటికే ఇచ్చిన నోటిఫికేషన్ ఆధారంగా త్వరలో భర్తీ చేసేందుకు నిర్ణయం తీసుకున్నారు. తిరుపతిలో టీటీడీ నిర్వహిస్తున్న రోడ్ల నిర్వహణ, మరమ్మతులు, వీధి దీపాల నిర్వహణ కొనసాగించాలని నిర్ణయం తీసుకున్నారు. తిరుమలలోని రహదారులు, ప్రధాన కూడళ్ళ పేర్లను వైష్ణవ పురాణాలు, ఆళ్వార్లు, అన్నమాచార్య సంకీర్తనలలోని శ్రీవారి నామాలు, తదితర పేర్లతో మార్చేందుకు కమిటీ ఏర్పాటు చేశాం. ఈ కమిటీలో జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం దూర విద్యా కేంద్రం డైరెక్టర్ డా. చక్రవర్తి రంగనాథన్, అన్నమాచార్య ప్రాజెక్టు ప్రత్యేక అధికారి డా.మేడసాని మోహన్, పురాణ ఇతిహాస ప్రాజెక్టు ప్రత్యేక అధికారి డా.డి.ప్రభాకర్ కృష్ణమూర్తిలతో కమిటీ ఏర్పాటు చేశాం. శ్రీవారి ఆలయంలో ఒక ప్రధాన సన్నిధి యాదవతో పాటు అదనంగా మరో సన్నిధి యాదవ పోస్టుల ఏర్పాటు, నిబంధనల ప్రకారం భర్తీకి ఆమోదం ఇచ్చారు. తిరుమలలోను, కాలిబాటలో ఉన్న పురాతన ప్రాశస్త్యం గల నిర్మాణాల పరిరక్షణ కొరకు ప్రత్యేకంగా ఒక విభాగం ఏర్పాటు చేసి, అనుభవం గల అధికారుల నియామకానికి ఆమోదం ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అమలులో ఉన్న మధ్యాహ్న భోజన పథకం తరహాలో టీటీడీ ఎస్వీ జూనియర్ కళాశాల, ఎస్పీడబ్ల్యూ జూనియర్ కళాశాలలో డేస్కాలర్‌లకు మధ్యాహ్న భోజనం అందించాలని నిర్ణయం. జగిత్యాల జిల్లా కొండగట్టులోని శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయంలో భక్తుల సౌకర్యార్థం వసతి సముదాయం నిర్మాణానికి నిర్ణయం తీసుకున్నారు.

# కానిస్టేబుల్ అభ్యర్థులకు నియామక పత్రాలు

## ఉద్యోగాలు పొందినవారికి సిఎం, డిప్యూటీ సిఎం, హోంమంత్రి అభినందనలు



**అమరావతి, డిసెంబర్ 16 :**

ఏపీలో పోలీస్ కానిస్టేబుల్ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, హోం మంత్రి వంగలపూడి అనితలు నియామక పత్రాలు అందచేశారు. అలాగే వారిని అభినందిస్తూ ప్రశంసల వర్షం కురిపించారు. పాడేరుకు చెందిన గిరిజన యువకుడు బాబురావును సీఎం చంద్రబాబు అభినందించారు. అతడు మరింత ఉన్నత స్థానాలకు అధిరోహించాలని ఆకాంక్షించారు. అఖిల భారత సర్వీసు సాధించి జిల్లాకు ఎస్పీ కావాలన్నారు. అనంతరం బాబురావు మాట్లాడుతూ.. తన ఊరికి రహదారి వేయాలని సీఎం చంద్రబాబును కోరారు. ఆ బాధ్యత డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తీసుకుంటారని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. బలభద్రపురం గ్రామానికి చెందిన మణికంఠ సైతం ఉన్నత స్థానానికి వెళ్లాలన్నారు. మణికంఠ బీఎస్సీ కెమిస్ట్రీ చదవి కానిస్టేబుల్‌గా ఎంపికయ్యారని సీఎం చంద్రబాబు వివరించారు. చిన్నతనం నుంచి ప్రభుత్వ ఉద్యోగం చేయాలని గుంటూరు అర్బన్ ప్రాంతానికి చెందిన కాశింశెట్టి అఖిల్ గోపీచంద్‌కు ఉండేదన్నారు. బిఎస్సీ కంప్యూటర్స్ చేసిన అఖిల్.. ఆ దిశగా కష్టపడి చదవి ఈ ఉద్యోగం సాధించారని చెప్పారు. మీ ముఖాల్లో ఆనందం చూడాలని తాము కూటమిగా ఏర్పడి కష్టపడి పనిచేస్తున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. కార్యక్రమానికి హాజరై నియామక పత్రం పొందిన మహిళా కానిస్టేబుల్ కొమ్ము శిరీష్ మాట్లాడుతూ.. అన్నమయ్య జిల్లా మారుమూల గ్రామం నుండి తాను వచ్చానన్నారు. తన తండ్రిని ఆడపిల్లలను చదివించ వద్దంటూ అందరూ చెప్పేవారన్నారు. తనకు ఆడబిడ్డలు అయినా.. మగబిడ్డలయినా ఒకరే వారికి తన తండ్రి చెప్పేవారని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. తన సోదరి బిహార్ రాజధాని పాట్నాలోని ఎన్ఐటీలో సివిల్ ఇంజినీరింగ్ చదువుతోందని ఈ సందర్భంగా కొమ్ము శిరీష వెల్లడించారు. తనను ఎమ్మెస్సీ కెమిస్ట్రీ చదివించారని ఈ సందర్భంగా శిరీష తెలిపింది. శిరీష వ్యాఖ్యలపై సీఎం చంద్రబాబు స్పందించారు. మామూలు కుటుంబంలో జన్మించిన వారిని అసాధారణ పట్టుదలతో ఆ తల్లిదండ్రులు చదివించారని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారికి సీఎం చంద్రబాబు ధన్యవాదాలు తెలిపారు.



# జిల్లా కమిటీల ఎంపికపై బాబు కసరత్తు

## త్రిసభ్య కమిటీ సభ్యులతో సమీక్ష
## జిల్లాల టిడిపి అధ్యక్షుల ఎంపిక ఖరారు



**అమరావతి, డిసెంబర్ 16 :**

తెలుగు దేశం పార్టీకి సంబంధించిన జిల్లా కమిటీల ఎంపిక కోసం నియమించిన త్రిసభ్య కమిటీ సభ్యులతో ఏపీ సీఎం చంద్రబాబు సమావేశం ముగిసింది. జిల్లా పార్టీ అధ్యక్ష పదవుల విషయం మీడియాలో వచ్చాక తలెత్తిన ఒకట్రెండు అభ్యంతరాలను పున:పరిశీలించాలని చంద్రబాబు సూచించారు. మహిళలకు ప్రస్తుతం ఉన్న 28.4 శాతం ప్రాధాన్యాన్ని 30 శాతానికి పెంచాలని చంద్రబాబు ఆదేశించారు. జిల్లా కమిటీల కోసం క్యాబినెట్ కూర్పు కన్నా ఎక్కువ కసరత్తు చేశానని సీఎం చంద్రబాబు అన్నారు. రాబోయే ఎన్నికల్లో మహిళా రిజర్వేషన్ వచ్చే అవకాశం ఉందని, వారిలో సమర్థవైన నాయకత్వాన్ని తీసుకురావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. జిల్లా అధ్యక్షులు, కమిటీల ఎంపికలో త్రిసభ్య కమిటీ అద్భుతంగా పనిచేసిందని, నెలాఖరులోపు రాష్ట్ర కమిటీ ప్రకటన ఉంటుందని తెలిపారు ప్రతి మూడు నెలలకు ఒకసారి కమిటీల పనితీరును సమీక్షిస్తానని, పనిచేయని వారిని తొలగించేందుకు కూడా వెనకాడనని చంద్రబాబు హెచ్చరించారు. తన దగ్గర నుంచి కార్యకర్త వరకు పార్టీ క్యాలెండర్‌కు అనుగుణంగా పనిచేయాల్సిందేనని స్పష్టం చేశారు. జనవరి నుంచి అందరూ పూర్తిస్థాయిలో రంగంలోకి దిగాల్సిందేనని తెలిపారు.

### జిల్లా పార్టీలకు టిడిపి అధ్యక్షుల ఖరారు...

పలు జిల్లాలకు అనుభవమున్న నేతల నియామకం

తెలుగుదేశం పార్టీ అధిష్టానం మరో కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలోని పలు జిల్లాలకు అధ్యక్షులను దాదాపుగా ఖరారు చేసినట్లు సమాచారం. ఈ మేరకు నియోజకవర్గ ఎమ్మెల్యేలతోపాటు జిల్లా పార్టీ నేతలకు అధిష్టానం సమాచారం ఇచ్చినట్లు ఒక ప్రచారం జరుగుతుంది.

టీడీపీ జిల్లా అధ్యక్షులు జాబితా.. ఇలా ఉంది

తిరుపతి జిల్లా: పనబాక లక్ష్మి, చిత్తూరు జిల్లా: షణ్ముగం,అన్నమయ్య జిల్లా: సుగవాసి ప్రసాద్,ప్రకాశం జిల్లా: ఉగ్ర నరసింహారెడ్డి,అనంతపురం జిల్లా: కాలవ శ్రీనివాసులు,శ్రీసత్యసాయి జిల్లా: ఎంఎస్ రాజు

నంద్యాల జిల్లా: ధర్మవరపు సుబ్బారెడ్డి,విజయనగరం జిల్లా: కిమిడి నాగార్జున,ఏలూరు జిల్లా: బడేటి చంటి

కాకినాడ జిల్లా: జోత్యుల నవీన్,బాపట్ల జిల్లా: సలగల రాజశేఖర్, పల్నాడు జిల్లా: కొమ్మాలపాటి శ్రీధర్

గుంటూరు జిల్లా: పిల్లి మాణిక్యాలరావు, ఎన్టీఆర్ జిల్లా: గద్దె అనురాధ, కృష్ణా జిల్లా: వీరంకి గురుమూర్తి

పశ్చిమ గోదావరి జిల్లా: రామరాజు, తూర్పుగోదావరి జిల్లా: వెంకటరమణచౌదరి,కోనసీమ జిల్లా: గుత్తుల సాయి, విశాఖ జిల్లా: చోడే పట్టాభిరామ్,అనకాపల్లి జిల్లా: బత్తుల తాతబ్బాయ్,కర్నూలు జిల్లా: వహీద్

నెల్లూరు జిల్లా: బీదా రవిచంద్ర, కడప జిల్లా: భూపేశ్ రెడ్డి పేర్లు ఖరారు అయినట్లు సమాచారం

# ఆరోగ్య శాఖలో మార్పులు

(మొదటి పేజీ (తరువాయి)

లేవన్నారు. గ్రామ, పట్టణ, కళాశాలలో కానీ పేదలలో ఎలాంటి చర్చ లేదన్నారు. కార్యకర్తలకు సంతకాలు పెట్టి చేతులు వాసిపోతున్నాయని ఆ పార్టీ కార్యకర్తలే చెబుతున్నారని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. ఈరోజు సచివాలయంలో వైద్య ఆరోగ్య శాఖపై సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. అత్యున్నత స్థాయి నిపుణుల సలహా బృందంతో వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం మాట్లాడారు. ఈ సమీక్షలో మంత్రి సత్యకుమార్ యాదవ్, వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులు, గేట్స్ ఫౌండేషన్ కంట్రీ డైరెక్టర్ అర్చనా వ్యాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఎలాన్‌మస్క్ సరికొత్త రికార్డు

(మొదటి పేజీ (తరువాయి)

జీతం కింద మస్క్‌కు ట్రిలియన్ డాలర్లు ఇచ్చేందుకు టెస్లా కంపెనీ షేర్‌హోల్డర్లు ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. టెక్సాస్‌లోని ఆస్టిన్‌లో గత నెల జరిగిన టెస్లా వార్షిక సర్వసభ్య సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. దీంతో పే ప్యాకేజీలో కొత్త రికార్డు క్రియేట్ అయ్యింది. మస్క్‌కు ట్రిలియన్ డాలర్ల పే ప్యాకేజీ అందాలంటే ఆయన ముందు కొన్ని టా÷-గ్గ÷ట్లను పూర్తి చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం టెస్లా మార్కెట్ విలువ 1.4 ట్రిలియన్ల డాలర్లుగా ఉన్నది. అయితే ఆ మార్కెట్ విలువను ఆయన 8.5 ట్రిలియన్ డాలర్లకు చేర్చాల్సి ఉంటుంది. స్వీయ డ్రైవింగ్ చేస్తున్న లక్షల సంఖ్యలో రోబోట్యాక్సీ వాహనాలను ఆయన కమర్షియల్ ఆపరేషన్‌లోకి తీసుకురావాల్సి ఉంటుంది. ఒకవేళ అన్నీ అనుకుల్లే సాగితే, ప్రపంచ కుబేరుడు మస్క్ ప్రపంచంలోనే తొట్టతొలి ట్రిలియనీర్ అయ్యే అవకాశాలు ఉన్నాయి.

# అధికార దుర్వినియోగం

(మొదటి పేజీ (తరువాయి)



వ్యక్తం చేశారు. ప్లాట్లకు అన్నిరకాల అనుమతులు కూడా ఉన్నాయి. బ్యాంకుల నుంచి లోన్లు కూడా వచ్చాయి. ఎన్నో ఏళ్లగా ఈఎంఐలు కూడా కడుతున్నారు. అయినా కూడా కుట్ర పన్ని కూల్చివేతలు జరిపారు. స్థలం వేరొకరిదే అయితే రిజిస్ట్రేషన్లు ఎలా చేశారు?. ఇళ్లకు ఎలా అనుమతులు ఇచ్చారు?.. బ్యాంకు లోన్లు ఎలా వచ్చాయి?.. క్రయవిక్రయాలపై పేపర్లలో కూడా ప్రకటనలు ఇచ్చారు. అలాంటప్పుడు ఆ సమయంలో ఎందుకు అభ్యంతరాలు చెప్పలేదు? అని ప్రశ్నించారాయన. ఈ క్రమంలో ఇళ్ల కూల్చివేతలపై సీబీఐ విచారణ జరిపించాలని.. బాధితులకు ఇళ్ల స్థలాలు ప్రభుత్వమే కేటాయించాలని.. వాళ్ల బ్యాంకు లోన్లు కూడా ప్రభుత్వమే కట్టాలని వైఎస్ జగన్ డిమాండ్ చేశారు. "బాధితులకు వైఎస్సార్సీపీ అండగా ఉంటుంది. అవసరమైన న్యాయ సహకారం కూడా అందిస్తాం. ఒకవేళ మీరు ఎంక్వైరీ వేయకపోతే.. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ పని చేస్తుంది. దోషులుగా మిమ్మల్ని కోర్టు ముందు నిలబెడుతుంది" అని కూటమి ప్రభుత్వాన్ని వైఎస్ జగన్ హెచ్చరించారు.

# రెవెన్యూ శాఖలో ప్రక్షాళన

(మొదటి పేజీ (తరువాయి)

పరిష్కారం కోసం చేపట్టిన సమగ్ర సర్వే ద్వారా కూడా పలు చోట్ల ఫలితాలు రావడం లేదని భావిస్తున్న ప్రభుత్వం.. ఈసారి ప్రక్షాళనలో పలు సంచలన నిర్ణయాలు తీసుకునే అవకాశాలు లేకపోలేదు. వీటి ద్వారా క్షేత్రస్థాయిలో సమస్యలు పరిష్కరించి సివిల్ వివాదాలను తగ్గించడమే లక్ష్యంగా పెట్టుకునే అవకాశం కనిపిస్తోంది. దీనిపై రెండు రోజుల్లో పూర్తిస్థాయి మార్గదర్శకాలు వెలువడతాయని తెలుస్తోంది.

# ఎంజి నరేగా మార్పు దారుణం



**అమరావతి, డిసెంబర్ 16 :**

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం చారిత్రాత్మకమని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి అభివర్ణించారు. ఇలాంటి పథకానికి పేరు మార్చి వికసిత భారత్ – జీ రామ్ జీగా ప్రస్తుతం నామకరణం చేశారని మంగళవారం న్యూఢిల్లీలో ఆయన విమర్శించారు. మహాత్మా గాంధీ పేరు తొలగించడం ఆర్ఎస్ఎస్ – బీజేపీ ఆలోచనకు నిదర్శనమని పేర్కొన్నారు. ఈ పథకాన్ని బలపర్చకుండా నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తున్నారంటూ మోదీ ప్రభుత్వంపై కాంగ్రెస్ ఎంపీ నిప్పులు చెరిగారు. కేంద్ర – రాష్ట్ర నిధుల వాటా 40:60గా మార్చడంతో రాష్ట్రాలపై భారం పెరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రాల్లో నిధులు లేకపోతే పథకం అమలు కష్టమయ్యే పరిస్థితి ఉందన్నారు. 125 రోజులు అంటూనే ఉపాధి హామీని అస్పష్టంగా మార్చారంటూ కేంద్రంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పథకానికి దేవుడి పేరు పెట్టి ప్రజలను తప్పు దోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారంటూ కేంద్రం తీరును ఈ సందర్భంగా ఆయన ఎండగట్టారు. మహాత్మా గాంధీ పేరును చరిత్ర నుంచి తొలగించాలన్న ఉద్దేశంతోనే ఇలా చేశారని విమర్శించారు. పథకం పేరుతోపాటు అమలులో తీసుకు వచ్చిన మార్పులకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఆందోళనలకు కాంగ్రెస్ పార్టీ దిగుతుందని ఎంపీ చామల స్పష్టం చేశారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ హయాంలో 2005లో ఉపాధి హామీ పథకం ప్రారంభమైందని గుర్తు చేశారు. గ్రామీణ పేద ప్రజలకు 100 రోజుల గ్యారెంటీ ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో అప్పటి కేంద్రం 100శాతం నిధులు కేటాయించిందని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి గుర్తు చేశారు. మరోవైపు నేషనల్ హెరాల్డ్ కేసులో పోలీస్, ఆర్థిక నేరాల విభాగం దాఖలు చేసిన పిటిషన్‌ను కోర్టు కొట్టివేసిందని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ఈ కేసులో ఎలాంటి ఆర్థిక లావాదేవీలు లేవని కోర్టు సైతం స్పష్టం చేసిందని తెలిపారు. రాహుల్, సోనియా గాంధీలపై కక్ష సాధింపు రాజకీయాలే లక్ష్యంగా ఈడీ కేసు నమోదు చేసిందని ఆరోపించారు. బలమైన ప్రాంతీయ నాయకత్వాన్ని నిర్వీర్యం చేయడానికే కేంద్ర సంస్థలను దుర్వినియోగం చేస్తోందంటూ బీజేపీపై ఎంపీ చామల ఆగ్రహం వ్యక్తం చేశారు.

# సైబర్ నేరగాళ్లతో జర భద్రం

## ఆన్‌లైన్ మోసాలపై విస్తృత అవగాహన..
## రాయదుర్గం ప్రాంతంలో పోలీస్ స్టేషన్ల వార్షిక తనిఖీలు..
## జిల్లాలో తగ్గిన క్రైమ్ రేటు..
## జిల్లా ఎస్పీ జగదీష్ వెల్లడి..

**డి హిరేహాల్/ రాయదుర్గం డిసెంబర్ 16**

విస్తరించిన టెక్నాలజీ కారణంగా సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజల అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా ఆన్లైన్ లావాదేవీల్లో జాగ్రత్తలు పాటించాలని అనంతపురం జిల్లా ఎస్పీ జగదీష్ గారు సూచించారు. జిల్లా పరిధిలోని పోలీస్ స్టేషన్ల వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం కళ్యాణదుర్గం సబ్ డివిజన్ పరిధిలోని కళ్యాణదుర్గం రాయదుర్గం డి హిరేహాల్ మండలాల పోలీస్ స్టేషన్లను జిల్లా ఎస్పీ జగదీష్ తనిఖీ చేశారు. ముందుగా నియోజకవర్గంలోని డి హీరే హాల్ మండలం పోలీస్ స్టేషన్ ను పరిశీలించారు. వార్షిక కు సంబంధించిన కేసుల నమోదులు పరిష్కారాలు వంటి రికార్డులను ఆయన పరిశీలించారు. అనంతరం హైవే రోడ్డు విస్తరణలో భాగంగా పోలీస్ స్టేషన్ తాత్కాలికంగా రెవెన్యూ అదనపు భవనంలోకి మారుతున్న తరుణంలో భవనం పరిస్థితి సదుపాయాలు స్టేషన్ భద్రత వంటి విషయాల తో పాటు అక్కడ తాత్కాలికంగా ఏర్పాటు చేసుకుంటున్న రెవిన్యూ భవనం పరిసర ప్రాంతాలను పరిశీలిస్తూ స్టేషన్ భద్రత విషయంపై రాయదుర్గం రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కే వెంకటరమణ ఎస్సై ఏ గురు ప్రసాద్ రెడ్డి తో చర్చించారు. అనంతరం జిల్లా ఎస్పీ జగదీష్ తోపాటు కళ్యాణదుర్గం సబ్ డివిజన్ అధికారి రవిబాబు రాయదుర్గం రూరల్ ఇన్స్పెక్టర్ కె వెంకటరమణ లతో కలిసి ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన మురిడి ఆంజనేయ స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం రాయదుర్గం పట్టణంలోని పురాతన దేవాలయం దశభుజ గణపతి దేవాలయానికి వెళ్లి స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు తీసుకున్నారు. అనంతరం రాయదుర్గం పోలీస్ స్టేషన్ ను జిల్లా ఎస్పీ జగదీష్ పరిశీలించారు. స్టేషన్ రికార్డులను పరిశీలించి ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. పోలీస్ స్టేషన్లో మొక్కలు నాటారు. అనంతరం రాయదుర్గం పోలీస్ స్టేషన్ ఆవరణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ జగదీష్ మాట్లాడుతూ జిల్లాలో అమలు చేస్తున్న ప్రత్యేకమైన కఠిన చర్యలు ప్రజల్లో విస్తృతంగా చేస్తున్న అవగాహన కార్యక్రమాల వల్ల నేరాల సంఖ్య గణనీయంగా తగ్గిందని ఆయన అన్నారు. ఆన్లైన్ మోసాలు ఫేక్ కాల్స్ లింకులు ఓటిపి మోసాల విషయంలో ప్రజల అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. బ్యాంక్ అధికారులు పోలీసుల పోలీసులమని చెప్పి వచ్చే కాల్స్ కు స్పందించవద్దని వ్యక్తిగత వివరాలు ఎవరికి ఇవ్వద్దని ఆయన సూచించారు. అనుమానస్పద లింకులు క్లిక్ చేయకుండా వెంటనే దగ్గరలో ఉన్న పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన తెలిపారు. జిల్లా వ్యాప్తంగా సైబర్ నేరాలపై ప్రత్యేకంగా స్పెషల్ డ్రైవ్ లు నిర్వహించామని ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో సైతం అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని జిల్లా ఎస్పీ జగదీష్ తెలిపారు. మేము ప్రత్యేకంగా తీసుకుంటున్న చర్యలు ఫలితంగా గతంతో పోలిస్తే అనంతపురం జిల్లాలో భారీగా క్రైమ్ రేట్ తగ్గిందని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ముఖ్యంగా దొంగతనాలు ఆన్లైన్ మోసాలు కేసుల్లో స్పష్టమైన తగ్గుదల నమోదయిందని ఆయన తెలిపారు. ప్రజలు పోలీసులతో సహకరిస్తే ఎలాంటి నేరాలు అయినా నియంత్రించవచ్చని, భద్రతా విషయంలో ఎవరు నిర్లక్ష్యం చేయరాదని సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. సైబర్ నేరాలపై 1930 హెల్ప్ లైన్ వినియోగించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. జిల్లాలో సిబ్బంది కొరత దృష్ట్యా భారీగా నియమకాలు చేపట్టామని ఎస్పీ జగదీష్ తెలిపారు. జిల్లాకు 320 మంది పోలీసులు 20 మంది ఎస్ఐల కు పోస్టింగ్ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా వార్షిక తనిఖీల్లో భాగంగా పోలీస్ స్టేషన్లో పరిపాలన వ్యవస్థ కేసుల నమోదు విధానం, కేసుల పురోగతి, కేసులు సంబంధించిన రికార్డుల పరిశీలన, పెండింగ్ కేసులు, ప్రజల ఫిర్యాదుల నమోదుల వివరాలు, విచారణ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ముఖ్యంగా న్యాయం కోసం పోలీస్ స్టేషన్ కు వస్తున్న మహిళలు పిల్లలు వృద్ధులు కేసులు విచారించి సత్వరమే న్యాయం జరిగేలా సిబ్బందికి ఆదేశాలు ఇచ్చినట్లు ఆయన తెలిపారు. న్యాయం చేయడంలో పోలీసులు నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కళ్యాణదుర్గం డిఎస్పి రవిబాబు రాయదుర్గం అర్బన్ ఇన్స్పెక్టర్ జయ నాయక్ రూరల్ ఇన్స్పెక్టర్ కే వెంకటరమణ డి హీరేహాల్, బొమ్మలహాల్ కనేకల్ రాయదుర్గం టౌన్ గుమ్మగట్ట మండలాల సబ్ ఇన్స్పెక్టర్లు ఏ గురు ప్రసాద్ రెడ్డి, నబీరసూల్, నాగ మధు, ప్రసాద్, ఈశ్వర్ తోపాటు ఆయా మండలాల పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



డి హిరేహాల్ పోలీస్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ జగదీష్


దశభుజ గణపతి స్వామివారిని దర్శించుకుంటున్న జిల్లా ఎస్పీ జగదీష్



రాయదుర్గం పట్టణ పోలీస్ స్టేషన్లో రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ.
రాయదుర్గం పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటుతున్న జిల్లా ఎస్పీ జగదీష్


తైక్వాండో క్రీడాకారులను అధినందిస్తున్న దృశ్యం

## బ్లాక్ బెల్ట్ టెస్ట్‌లో తాడిపత్రి క్రీడాకారుల ప్రతిభ

**తాడిపత్రి, డిసెంబర్ 17:**

తెలంగాణ రాష్ట్రం, జోగులాంబ గద్వాల్ జిల్లా గద్వాల్‌లోని బ్రిందావన్ గార్డెన్స్ వేదికగా ఈనెల 14న నిర్వహించిన నేషనల్ పూంసే రిఫరీ సెమినార్ %డ% బ్లాక్ బెల్ట్ టెస్ట్ లో తాడిపత్రి తైక్వాండో క్రీడాకారులు అత్యంత ప్రతిభను ప్రదర్శించారని తైక్వాండో జిల్లా కార్యదర్శి సాయి తెలిపారు. ఈ సందర్భంగా తైక్వాండో జిల్లా కార్యదర్శి సాయి మాట్లాడుతూ ఈ సెమినార్‌ను తైక్వాండో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (టిఎఫ్ఐ) ఆధ్వర్యంలో తెలంగాణ స్టేట్ తైక్వాండో అసోసియేషన్ నిర్వహించిందని తెలిపారు. ఈ సెమినార్ %డ% బ్లాక్ బెల్ట్ టెస్ట్ పరీక్షలో తాడిపత్రి పట్టణానికి చెందిన క్రీడాకారులు ప్రతిభను ప్రదర్శించి, విజయవంతంగా ఉత్తీర్ణులయ్యారన్నారు. బ్లాక్ బెల్ట్ టెస్ట్‌లో క్రీడాకారులు ఉమా మహేష్, అనిల్ నాయక్, సాయి సంయుక్త, సాయి నరసింహ రెడ్డి, గౌతమ్ కుమార్ రెడ్డి ఉత్తీర్ణులైనారని, పూంసే సెమినార్‌లో క్రీడాకారులు రాహుల్, నాగమోక్షిత, మహేష్ పాల్గొన్నారని తెలిపారు. ఈ ప్రతిష్టాత్మక సెమినార్‌కు 8వ డాన్ బ్లాక్ బెల్ట్, ఇంటర్నేషనల్ రిఫరీ మాస్టర్ వాన్ యాంగ్ లీ శిక్షణ అందించి, పూంసే న్యాయ నిర్ణయ విధానాలు, తాజా రూల్స్ పై క్రీడాకారులకు అవగాహన కల్పించారని తెలిపారు. తాడిపత్రి తైక్వాండో క్రీడాకారులు జాతీయ స్థాయి వేదికపై బ్లాక్ బెల్ట్ సాధించడం జిల్లాకు గర్వకారణమని పేర్కొన్నారు. ఇటువంటి సెమినార్లు క్రీడాకారుల భవిష్యత్‌కు బలమైన పునాది వేస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు శివయ్య, తైక్వాండో సాయి, సీనియర్ కోచ్ నరేష్ లు పాల్గొని క్రీడాకారులను అభినందించారు.



తలుపూరులో పారిశుద్ధ్యం పనులను పర్యవేక్షించిన ఎంపీడీవో లక్ష్మీనరసింహ

## తలుపూరులో పారిశుద్ధ్యం పనుల పరిశీలన

### ఎంపీడీవో లక్ష్మీనరసింహ ..

**ఆత్మకూరు, డిసెంబర్ 16:**

మండల పరిధిలోని తలుపూరు గ్రామంలో మంగళవారం ఎంపీడీవో జీ లక్ష్మీనరసింహ పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించారు. గ్రామంలో త్రాగునీటి సరఫరా గురించి ఇతర అభివృద్ధి కార్యక్రమాల గ్రామస్తులతో ఆరా తీశారు. జిల్లా పరిషత్ హైస్కూల్ లో 10వ తరగతి విద్యార్థులకు జరుగుతున్న 100 రోజుల పరీక్షా ప్రణాళిక అమలును, వారికి సబ్జెక్టుల వారీగా వచ్చిన మార్కులను పరిశీలించి వారు ఇంకా బాగా చదివి మంచి మార్కులు తెచ్చుకునేలాగా ప్రోత్సహించవలనని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థిని విద్యార్థులతో చర్చించి పరీక్షలకు సన్నద్ధత గురించి సూచనలు సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మగ్బుల్ బాష, వీఆర్వో సుధాకర్ రెడ్డి, జడ్పీహెచ్ఎస్ ఇన్చార్జి హెడ్మాస్టర్ సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.


తలుపూరు హైస్కూల్లో విద్యార్థులకు సూచనలు అందజేస్తున్న ఎంపీడీవో లక్ష్మీనరసింహ

## అంగరంగ వైభవంగా షాహ్ మీర్ ఔలియ ఉరుసు

**తలుపుల, డిసెంబర్ 17:**

తలుపులలో హజ్రత్ షాహ్ మీర్ ఔలియ ఉరుసు మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఉరుసు మహోత్సవంలో కదిరి శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ పాల్గొని ప్రార్థనలు చేశారు. హజ్రత్ ఖ్వాజా సయ్యద్ షా ముహమ్మద్ హుసైని షాహ్ మీర్ ఔలియ (ర.హ) 261 వ ఉరుసు మహోత్సవంలో భాగంగా మంగళవారం గంధం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నలుమూలల నుంచి పెద్ద ఎత్తున భక్తులు, టీడీపి నాయకులు పాల్గొన్నారు.



## అంకంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు మైక్ సెట్ వితరణ

### పది పరీక్షలలో అత్యధిక మార్కుల సాధించిన విద్యార్థికి రూ. 5 వేల నజరానా..

**బెళుగుప్ప, డిసెంబర్ 16:**

బెళుగుప్ప మండలం పరిధిలోని అంకంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల కోసం రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, జిల్లా టిడిపి నేత పయ్యావుల శ్రీనివాసుల ఆశీస్సులతో అంకంపల్లి తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు సుమారు 15 వేల రూపాయల విలువ చేసే మైక్ సెట్ ను ఉచితంగా వితరణ చేశారు. మంగళవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో తెలుగు యువత జిల్లా అధ్యక్షులు తమ్మినేని పవన్ కుమార్, టీడీపీ నాయకులు మాదినేని నరేంద్ర చౌదరి, నరసింహులు, తలారి గోపాల్, మాదినేని సాగర్, మాదినేని రవి, కోనంకి సోము, గెన్నె లక్ష్మీనారాయణ, సూరప్ప, నారాయణ,పరమేష్,సత్యప్ప తదితరులు మైక్ సెట అందజేశారు. అలాగే 2025-2026 విద్యా సంవత్సరం 10వ తరగతి పబ్లిక్ పరీక్షలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు 5 వేల రూపాయలు బహుమతిగా అందచేస్తానని మాదినేని సాగర్ ఈ సందర్భంగా విద్యార్థులకు బహుమతిని ప్రకటించారు. విద్యార్థులను ప్రోత్సహించడంలో భాగంగానే ఈ నగదు బహుమతిని అందజేస్తున్నామని సాగర్ తెలిపారు. పాఠశాలకు మైక్ సెట్ తో పాటు, పదవ తరగతి పబ్లిక్ పరీక్షలలో అత్యధిక మార్కులు సాధించిన వారికి 5 వేల రూపాయల బహుమతిని ప్రకటించినందుకు టీడీపీ కుటుంబ సభ్యులకు ప్రధానోపాధ్యాయులు రాజశేఖర్ రెడ్డి ఉపాధ్యాయులు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులు ఈ సమావేశంలో ప్రధానోపాధ్యాయులు రాజశేఖర్ రెడ్డి, ఎస్ఎంసి కమిటీ చైర్మన్ రాజశేఖర్, ప్రాథమిక పాఠశాల ఎస్ఎంసి చైర్మన్ తలారి సురేష్, విద్యార్థులు పాల్గొన్నారు.


అంకంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మైక్ సెట్ అందిస్తున్న అంకంపల్లి టీడీపీ కుటుంబ సభ్యులు

# హిందూ సంప్రదాయాన్ని కించపరుస్తున్న ప్రిన్సిపాల్

## నుదుట బొట్టు, చేతులకు గాజులు పెట్టుకోకూడదని విద్యార్థినులకు హుకుం..
## అరవింద శత జయంతి పాఠశాల ప్రధానోపాధ్యాయుడి నిర్వాకం..
## వెంటనే సస్పెండ్ చేయాలి..
## జైశ్రీరామ్ భక్త మండలి అధ్యక్షులు నిచ్చెనమెట్ల రాధాకృష్ణ ..

**తాడిపత్రి, డిసెంబర్ 17:**

పట్టణంలో ప్రముఖ విద్యాలయమైన అరవింద శత జయంతి పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న నాగరాజు హిందూ ఆచారాలను గురించి విద్యార్థినులతో అవహేళనగా మాట్లాడుతున్నారని జైశ్రీరామ్ భక్త మండలి అధ్యక్షులు నిచ్చెనమెట్ల రాధాకృష్ణ ఆరోపించారు. తాడిపత్రిలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో నిచ్చెనమెట్ల రాధాకృష్ణ మాట్లాడుతూ అరవింద శత జయంతి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగరాజు విద్యార్థినులతో మీరు బొట్టు పెట్టుకుంటే ఏమొస్తుందని, బొట్టు చెరిపివేయడం, గాజులు తీసివేయడం, తాయత్తులు తీసివేయడం ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నాడని అన్నారు.. గత 15 రోజులుగా ఆయన ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నాడన్నారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులు అన్యమత ప్రచారం చేయడం అనేది తీవ్రమైన చర్యయని, ఇది విద్యార్థినుల మనస్సులను ప్రభావితం చేస్తుందన్నారు. ఉపాధ్యాయులు తమ మత విశ్వాసాలను విద్యార్థులపై రుద్దడానికి ప్రయత్నించడం సరియైన పద్ధతి కాదన్నారు. ఉపాధ్యాయులు తమ వ్యక్తిగత మత విశ్వాసాలను పాఠశాలలోకి తీసుకురాకూడదన్నారు. విద్యార్థులకు జ్ఞానాన్ని అందించడం, వారిని విమర్శనాత్మకంగా ఆలోచించేలా ప్రోత్సహించడం వారి విధియని, కానీ వారిపై మతపరమైన ప్రభావం చూపడం వృత్తి విరుద్ధమన్నారు. నాగరాజుని వెంటనే తొలగించాలని, పాఠశాల యాజమాన్యానికి డిమాండ్ చేస్తున్నామన్నారు. మండల విద్యాశాఖ అధికారి విచారణ జరిపి అతనిపైన చర్యలు తీసుకొన వలసిందిగా కోరుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జైశ్రీరామ్ భక్త మండలి సభ్యులు ప్రతాపరెడ్డి, దివాకర్ బాబు పాల్గొన్నారు.


విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న జైశ్రీరామ్ భక్త మండలి అధ్యక్షులు నిచ్చెనమెట్ల రాధాకృష్ణ

# ఉపాధ్యాయుల క్రికెట్ టోర్నమెంట్ విజేత బ్రహ్మసముద్రం

## హోరా హోరీగా సాగిన క్రికెట్ మ్యాచ్‌లు..
## డివైఇఓ మల్లారెడ్డి..

**బెళుగుప్ప, నవంబర్ 16:**

క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో గెలుపోవటములను సమానంగా తీసుకోవాలని డివైఈవో మల్లారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం బెళుగుప్ప మండలం యర్రగుడి క్రీడా మైదానంలో కళ్యాణదుర్గం డివిజనల్ క్రికెట్ ఫైనల్ మ్యాచ్ బ్రహ్మసముద్రం మండలం, కనేకల్ మండలం ల మధ్య హోరాహోరీగా జరిగింది. ముందుగా టాస్ గెలిచి బ్రహ్మసముద్రం మండలం బ్యాటింగ్ చేపట్టి నిర్ణీత 15 ఓవర్లలో 124/5 బ్రహ్మసముద్రం మండలం క్రీడాకారుడు మహేష్ అత్యధికంగా 48 బాల్స్ కు 81 పరుగులు చేశాడు. తర్వాత బ్యాటింగ్ చేపట్టిన కనేకల్ జట్టు నిర్ణీత 15 ఓవర్లకు 108/8 చేసింది. 16రన్లతో బ్రహ్మసముద్రం మండలం జట్టు విజయం సాధించి ఈనెల 22, 23 తేదీలలో అనంతపురంలో జరిగే జిల్లాస్థాయి పోటీలకు అర్హత సాధించింది. ముగింపు బహుమతి ప్రధానోత్సవానికి ముఖ్య అతిథిగా డివైఈవో పాటిల్ మల్లారెడ్డి, ఎంఈఓ 2 హరికృష్ణ, వేణుగోపాల్ ఎంఈఓ 1 డి .హిరేహాల్, భవాని శంకర్ ఎంఈఓ 2 కనేకల్, కే గోపాల్ రెడ్డి కళ్యాణదుర్గం డివిజనల్ కోఆర్డినేటర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ డిఈఓ మల్లారెడ్డి గారు మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధ్యాయులకు చక్కటి అవకాశాన్ని కల్పించిందని ఈ సదవకాశాన్ని కల్పించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ మారుమూల ప్రాంతంలో ఇక్కడ ఎలాంటి సౌకర్యాలు లేని ప్రాంతంలో కూడా ఇన్ని జట్లు వచ్చి ఇక్కడ పాల్గొనడం ఎర్రగుడి గ్రామానికి విశేషమని ఈ క్రీడా మైదానాన్ని ఇంత చక్కగా తీర్చిదిద్దిన యర్రగుడి వాసులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ టోర్నమెంట్ కు సహాయ సహకారాలు అందించిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. విజయం సాధించిన బ్రహ్మసముద్రం మండలం జట్టుకు మెడల్స్ తోపాటు విన్నర్స్ కప్పును అందజేశారు. ఈ కార్యక్రమంలో పీడీలు గంగాధర్, శ్రీనివాసరెడ్డి, సిద్దన్న, శివకేశవులు తిమ్మరాజు తదితరులు పాల్గొన్నారు.




ఎర్రగుడిలో జరిగిన ఉపాధ్యాయుల క్రికెట్ ఫైనల్ మ్యాచ్‌లో గెలుపొందిన బ్రహ్మసముద్రం జట్టుకు బహుమతి ప్రధానం చేస్తున్న డివైఈవో మల్లారెడ్డి, క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న దృశ్యం


బెళుగుప్ప విద్యుత్ సబ్ స్టేషన్లో తనిఖీ నిర్వహిస్తున్న ఎలక్ట్రికల్ చీఫ్ జనరల్ మేనేజర్ ఉమాపతి

## విద్యుత్ సబ్ స్టేషన్ తనిఖీ

### ఎలక్ట్రికల్ చీఫ్ జనరల్ మేనేజర్ ఉమాపతి..

**బెళుగుప్ప, డిసెంబర్ 16:**

బెళుగుప్పలోని విద్యుత్ సబ్ స్టేషన్ ను మంగళవారం ఎలక్ట్రికల్ చీఫ్ జనరల్ మేనేజర్ ఉమాపతి తనిఖీ చేశారు. ఈ తనిఖీలో భాగంగా సబ్ స్టేషన్ ఆపరేటర్ గా ఉన్నటువంటి లైన్ మెన్ రుద్రమణి ని సప్లై టైమింగ్, అగ్రికల్చర్ టైమింగ్, ఎల్ సి గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే ఫీడర్స్ ట్రిప్పింగ్ ఎన్నిసార్లు అవుతున్నాయని ఆరా తీసారు. అలాగే వివిధ రకాల రిజిస్టర్ల ను చెక్ చేస్తూ ఆపరేటర్ తో ఏమైనా ఇబ్బందులు ఉంటే తెలియజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీజీఎం ఉమాపతి తోపాటు మండల ఏఈ గంగాధర్, ఎల్ఐ రఘు రామయ్య, తదితర సిబ్బంది పాల్గొన్నారు.


బెళుగుప్ప విద్యుత్ సబ్ స్టేషన్లో తనిఖీ నిర్వహిస్తున్న ఎలక్ట్రికల్ చీఫ్ జనరల్ మేనేజర్ ఉమాపతి

## 24న పంపనూరులో హుండీ లెక్కింపు

### 26న టెంకాయల బహిరంగ వేలం ..

**ఆత్మకూరు, డిసెంబర్ 16:**

ఆత్మకూరు మండలం పంపనూరు శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయంలో ఈనెల 24వ తేదీ ఉదయం 9 గంటలకు దేవాలయ హుండీ లెక్కింపు నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ జి.వేణుగోపాల్ రెడ్డి, ఈవో బి. బాబు ఒక ప్రకటనలో తెలియజేశారు. అలాగే 26న దేవాలయ ప్రాంగణంలో టెంకాయలు అమ్ముకోవడానికి బహిరంగ వేలంపాట నిర్వహిస్తున్నామన్నారు. వేలంలో పాల్గొను వారు 26వ తేదీ ఉదయం 11 గంటలకు దేవస్థానం లో జరిగే వేలంపాటలో పాల్గొనవచ్చునని తెలియజేశారు. టెంకాయల వేలంపాటలో పాల్గొన్నదలచిన వారు ముందుగా పదివేల రూపాయలు డిపాజిట్ చెల్లించి వేలంపాటలో పాల్గొనవలెనని, వేలంపాట ముగిశాక వేలం పాటలో అధిక మొత్తంలో పాడి అవకాశం చేజిక్కించుకున్న వారు తదుపరి మొత్తం చెల్లించవలసి ఉంటుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

## తోలుబొమ్మల కళాకారిణి డి.శివమ్మకు అభినందనల

**అనంతపురం, డిసెంబర్ 16:**

తోలుబొమ్మల కళాకారిణి డి.శివమ్మ ధర్మవరం ఖ్యాతిని దేశమంతా తెలుసుకునేలా చేశారని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం నియోజకవర్గ తెదేపా ఇన్చార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. ధర్మవరం మండలం, నిమ్మలకుంట గ్రామానికి చెందిన తోలుబొమ్మల కళాకారిణి డి.శివమ్మ గారు ప్రఖ్యాత జాతీయ"శిల్పగురు" అవార్డును అందుకున్నారు. 2025, డిసెంబర్ 9వ తేదీన న్యూఢిల్లీ లోని, విజ్ఞాన్ భవన్ లో జరిగిన హస్తకళల జాతీయ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో శివమ్మ భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతులమీదుగా అవార్డు అందుకున్నారు. ఈ నేపథ్యంలో పరిటాల శ్రీరామ్, పరిటాల సునీత అనంతపురం క్యాంప్ కార్యాలయంలో శివమ్మని సత్కరించారు. స్థానిక నాయకులతో కలిసి శాలువాతో సత్కరించి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తోలుబొమ్మలాట అన్నది మన సంస్కృతిలో ఒక భాగం అన్నారు.





శ్రీ లక్ష్మీ దేవికి పూలతో అలంకరణ

## ఘనంగా శ్రీ లక్ష్మీదేవికి రుద్రాభిషేకం

**అమరాపురం, డిసెంబర్ 16:**
మండల పరిధిలో వీరాపురం గ్రామంలో వెలిసిన శ్రీ లక్ష్మీదేవి ఆలయములో మంగళవారం ప్రధాన అర్చకులు శ్రీ జోగప్ప స్వామి శ్రీ సిద్ధార్థ స్వామి శ్రీ లక్ష్మీదేవికి రుద్రాభిషేకం, అభిషేకం, కుంకుమార్చన, పంచామృత అభిషేకం, వివిధ రకాల విశేష పూజలు, నిర్వహించారు. అమ్మవారిని పూలతో అలంకరణ చేశారు. . చుట్టుపక్కల గ్రామాల నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తమ మొక్కుబడును తీర్చుకున్నారు. వచ్చిన భక్తాదులకు అర్చకులు శ్రీ జోగప్ప స్వామి, శ్రీ సిద్ధార్థ స్వామి భక్తులకు మహా మంగళహారతి తీర్థ ప్రసాదాలు అందజేశారు.



హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

## శ్రీమత్ ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం హుండీ లెక్కింపు

**కదిరి (ముదిగుబ్బ), డిసెంబర్ 16:**
కదిరి పట్టణంలోని ప్రహ్లాద సమేత స్వయంభూ శ్రీమత్ ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి సంబంధించిన హుండీల లెక్కింపు మంగళవారం నిర్వహించారు. 70 రోజుల వ్యవధిలో హుండీల ద్వారా మొత్తం రూ.1,17,44,339 నగదు ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. అదేవిధంగా విదేశీ కరెన్సీగా యూఎస్ డాలర్లు 24, కెనడా డాలర్లు 10, ఒమన్ దయల్స్ 2, శ్రీలంక రూపాయలు 100 లభించాయి. అలాగే బంగారం 23 గ్రాములు, వెండి 753 గ్రాములు సమకూరినట్లు వెల్లడించారు. హుండీ లెక్కింపు కార్యక్రమం ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో జరగగా, జిల్లా దేవాదాయశాఖ అధికారి నరసింహరాజు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన సిబ్బంది, కెనరా బ్యాంకు మేనేజర్, బ్యాంకు సిబ్బంది, సేవా సంస్థల సభ్యులు పాల్గొన్నారు.



హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది



అధ్యక్షులు
బి.భరత్ కుమార్

ప్రధాన కార్యదర్శి
సి.హరికృష్ణ

## అగళి మండల యూటీఎఫ్ శాఖ నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

**అగళి, డిసెంబర్ 16:**
ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ అగళి మండల శాఖ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా శివశంకర్, అధ్యక్షులుగా బి.భరత్ కుమార్ సహాధ్యక్షులుగా ఎం. కుమార్, పి.ప్రశాంతి, ప్రధాన కార్యదర్శిగా సి.హరికృష్ణ, కోశాధికారిగా రమేష్, కార్యదర్శులుగా బోజేగౌడ్, దివ్య తేజ, కావ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యాయ సంక్షేమం విద్యాభివృద్ధికి నూతన కార్యవర్గం కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా బాధ్యతలు స్వీకరించిన వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ సంక్షేమం కోసం,విద్యాభివృద్ధికి మా సంఘ నాయకులకు తగిన ప్రాతినిధ్యం ఇవ్వగలరు అని విజ్ఞప్తి చేసారు.

## వివాహిత అదృశ్యం

**బత్తలపల్లి, డిసెంబర్ 16:**
మండలంలోని ఓబుళాపురం గ్రామానికి చెందిన వివాహిత ఐదు నెలలుగా కనిపించకుండా పోయిందని మంగళవారం ఆమె తల్లి జయమ్మ బత్తలపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. బత్తలపల్లి పోలీసులు తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఓబుళాపురం గ్రామానికి చెందిన దండు జయమ్మ నాల్గొవ కుమార్తె రవళిని పెనుకొండ మండలం వేతులూరిపల్లి గ్రామానికి చెందిన ఆంజనేయులుతో వివాహం జరిపించారు. వీరికి ఇద్దరు మగ పిల్లలు సంతానం వీరు అన్యోన్యంగా జీవిస్తున్నారు. తల్లిని చూడాలని రవళి ఐదు నెలల క్రితం ఓబుళాపురంకు వచ్చినట్లు తెలిపారు. వేతులూరిపల్లి గ్రామానికి తిరిగి వెలుతున్నట్లు చెప్పి వెళ్లిందని అయితే మెట్టినింటికి వెళ్లకుండా ఎక్కడికో వెళ్లిపోయిందని తెలిపారు. ఆచూకీ కోసం గాలించినా ప్రయోజనం లేకపోవడంతో తల్లి జయమ్మ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# నల్లమాడ సర్కిల్ స్టేషన్ల తనిఖీ

### నల్లమాడ నూతన పోలీస్ స్టేషన్ నిర్మాణ స్థలం పరిశీలన.. సిబ్బంది సమస్యలు నేరుగా తెలియజేస్తే పరిష్కరిస్తామని హామీ.. జిల్లా ఎస్పీ సతీష్ కుమార్..

**నల్లమాడ, డిసెంబర్ 16:**
నల్లమాడ సర్కిల్ పరిధిలోని సర్కిల్ కార్యాలయం, నల్లమాడ, ఓబుళ దేవర చెరువు, అమ్మడు గురు పోలీస్ స్టేషన్లను జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అన్ని పోలీస్ స్టేషన్లలోని రిజిస్టర్లు, కేసు రికార్డులు పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న కేసుల స్థితి, దర్యాప్తు పురోగతిని స్టేషన్ అధికారుల నుండి తెలుసుకున్నారు. సర్కిల్లోని పోలీస్ స్టేషన్ల పరిధిలో నేరాల పరిస్థితుల పై ఆరా తీశారు. స్టేషన్‌కు వచ్చే ప్రజలకు పట్ల మర్యాద పూర్వకంగా వ్యవహరిస్తూ వారి ఫిర్యాదులను సీరియస్‌గా తీసుకొని, చిన్న విషయాన్నీ కూడా నిర్లక్ష్యం చేయకుండా స్పందించాలని సూచించారు. బాధితులకు న్యాయం జరిగేలా దర్యాప్తు



నల్లమాడ సర్కిల్ కార్యాలయంలో సిఐతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ సతీష్ కుమార్



నల్లమాడ పోలీస్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ సతీష్ కుమార్

కొనసాగించాలని తెలిపారు. రాత్రి వేళల్లో గస్తీలు పెంచి చోరీల నివారణకు అడ్డుకట్ట వేయాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పేకాట, మట్కా,గంజాయి తదితర చట్ట వ్యతిరేక కార్యకలాపాలు నిర్మూలించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అవినీతి వంటి చర్యలకు ఏ మాత్రం తావు ఇవ్వకూడదన్నారు. సిబ్బంది నిర్లక్ష్యం వల్ల ప్రజలకు ఇబ్బంది కలిగినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్టేషన్ ల పరిధిలో చట్టం, శాంతి భద్రత పరిరక్షణలో భాగంగా నిరంతరం ప్రజలతో సమన్వయం కొనసాగించాలన్నారు."ప్రజల విశ్వాసమే పోలీసులకు నిజమైన బలం అని ఎస్పీ వివరించారు. స్టేషన్ ప్రాంగణం, లాకప్ గది, కంప్యూటర్ రూమ్, వాహన పార్కింగ్ స్థలం , పట్టుబడిన ద్విచక్ర వాహనాలు వంటి విభాగాలను పరిశీలించి, పలు సూచనలు చేశారు. తనిఖీ అనంతరం, ఎస్పీ ఆయా స్టేషన్ల సిబ్బందితో సమావేశమై విధి నిర్వాహణలో క్రమశిక్షణ, నిబద్ధత ప్రాముఖ్యతపై దృష్టి సారించాలన్నారు. మీ సమస్యలు ఏమున్నాకూడా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. అదేవిధంగా నల్లమాడ లో నూతన పోలీస్ స్టేషన్ నిర్మాణానికి స్థలాన్ని ఎస్పీ పరిశీలించారు. ఎస్పీ వెంట సిఐ నరేందర్ రెడ్డి, ఒడిసి , ఆమడగురు ఎస్సై లు మల్లికార్జున్ రెడ్డి, సుమతి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



ఓబుళ దేవర చెరువు పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో జిల్లా ఎస్పీ. అమడగూరు పోలీస్ స్టేషన్ వద్ద సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ సతీష్ కుమార్

# కాశినాయన ఆశ్రమంలో వైభవంగా ఆరాధనోత్సవాలు

**బత్తలపల్లి, డిసెంబర్ 16:**
మండలంలోని మాల్యవంతం సమీపంలోని శ్రీమహాగణపతి, అన్నపూర్ణేశ్వరి, లక్ష్మీనరసింహ సమేత శ్రీకాశీనాయన ఆశ్రమం నందు మంగళవారం 30వ ఆరాధన ఉత్సవాలను ఆలయ కమిటి సభ్యులు, గ్రామ పెద్దలు. భక్తులు ఆధ్వర్యంలో వైభవోపేతంగా నిర్వహించారు.



ప్రత్యేక అలంకరణలతో విరాజిల్లుతున్న శ్రీ కాశి నాయన

మంగళవారం తెల్లవారుజామున దేవుళ్లకు అభిషేకాలు, ఆలంకరణ, పూజా కార్యక్రమాలను ఆలయ అర్చకులు వెంకటేశ్వరస్వామి నిర్వహించారు. అనంతరం కాశీనాయన ఉత్సవ విగ్రహాలను ఊరేగింపు నిర్వహించారు. రాత్రి 8గంటలకు జ్యోతి ప్రజ్వలన గావించారు. జ్యోతుల ఊరేగింపు, కాశీనాయన ప్రతిమ ఊరేగింపు నిర్వహించారు. ఉత్సవ విగ్రహాల ముందు 108 మంది జ్యోతులు ఎత్తుకొని ముందుకు సాగారు. ఈ కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అర్ధరాత్రి 12 గంటలకు ఆకాశంలోకి జ్యోతులను వదిలారు. అదేవిధంగా రాత్రి 9.30 గంటలకు అష్టమాంకములు డ్రామా ప్రదర్శించారు. నిత్యఅన్నదానం కొనసాగుతోంది బత్తలపల్లి ఎస్ఐ సోమశేఖర్ తమ సిబ్బందితో బందోబస్తును పర్యవేక్షించారు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు



ప్రత్యేక అలంకరణలో
కాశి నాయన మూలవిరాట్

# వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

### ఎస్ఐ శోభారాణి ..

**అగళి, డిసెంబర్ 16 :**
వాహనదారులు నియమ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఎస్ ఐ శోభారాణి సూచించారు. మంగళవారం ఎస్ఐ శోభారాణి ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది పోలీస్ స్టేషన్ వద్ద వాహనాలను తనిఖీ చేసి నియమ నిబంధనలపై అవగాహన కల్పించారు,ముఖ్యంగా పరిమితికి మించి వాహనాలను స్పీడ్ గా నడపకూడదని అన్నారు. మద్యపానం సేవించి వాహనాన్ని నడపరాదని ప్రతి ద్విచక్ర వాహన చాలకుడు తనతో పాటు కూర్చున్న వారు కూడా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని అలాగే డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్,డాక్యుమెంట్లు తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. ఎవరైనా నియమ నిబంధనలను అతిక్రమించినట్లైతే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అనంతరం పట్టణంలోని బస్టాండ్ ఆవరణంలో ప్రజలకు ట్రాఫిక్ రూల్స్ గురించి వాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ శ్రీరాములు,కానిస్టేబుల్ శివకుమార్,రాజన్న, నాగరాజ్,వెంకటేష్ తదితరులు ఉన్నారు,



బస్టాండ్ ఆవరణలో ప్రజలతో మాట్లాడుతున్న ఎస్ఐ శోభారాణి

# నంబులపులకుంట తహసీల్దార్ కార్యాలయం ఆకస్మిక తనిఖీ

### జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ..

**నంబులపూలకుంట, డిసెంబర్ 16:**
నంబులపూలకుంట మండల తహసీల్దార్ కార్యాలయాన్ని జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని రెవెన్యూ విభాగ పనితీరును సమగ్రంగా పరిశీలించి అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. మొదట రెవెన్యూ రికార్డులు, మ్యుటేషన్ ఫైళ్లు, వివిధ రిజిస్టర్లను పరిశీలించిన జాయింట్ కలెక్టర్, భూ సంబంధిత రికార్డులు ఎలాంటి పొరపాట్లు లేకుండా ఖచ్చితంగా నిర్వహించాలన్నారు. పెదబల్లి గ్రామానికి సంబంధించిన రీ%-%సర్వే పురోగతిపై సమీక్ష నిర్వహించి, రీ సర్వే ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు పూర్తి స్థాయిలో తప్పులు రాకుండా రికార్డులు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా స్వామిత్వ సర్వే, గ్రామ కంఠాల రీ సర్వే అంశాలపై కూడా సమీక్షించారు. ఈ సర్వేల్లో ఏ చిన్న తప్పిదం కూడా చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో పార్థసారథి, గ్రామ పంచాయతీ కార్యదర్శులకు స్పష్టమైన సూచనలు చేశారు. ప్రజలకు భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా భూ రికార్డుల ఖచ్చితత్వమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు.
తహసీల్దార్ కార్యాలయ తనిఖీలో భాగంగా ప్రస్తుతం జరుగుతున్న కార్యాలయ మరమ్మత్తులను కూడా జాయింట్ కలెక్టర్ పరిశీలించారు. కార్యాలయానికి సోలార్ సిఎస్ఆర్ నిధులు మంజూరైనట్లు తెలుసుకుని, మరమ్మతులు తక్షణమే ప్రారంభించి వేగంగా పూర్తి చేయాలని ఏపీ ఎస్పీడీసీఎల్, సోలార్ శాఖ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో సౌకర్యాలు మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం నంబులపులకుంట మండల పరిధిలోని ప్రభుత్వ భూముల వివరాలపై తాసిల్దార్ దేవేందర్ నాయక్ తో సంబంధిత అధికారుల నుంచి సమాచారాన్ని తెలుసుకున్నారు. ప్రభుత్వ భూముల సంరక్షణ, అక్రమ ఆక్రమణల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశిస్తూ, భూ పరిపాలనలో పారదర్శకత, సమర్థత ఉండాలని జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ స్పష్టం చేశారు. జెసి వెంట కదిరి ఆర్డీవో శర్మ ఉన్నారు. ఈ ఆకస్మిక తనిఖీతో మండల రెవెన్యూ కార్యాలయ పనితీరుపై మరింత పర్యవేక్షణ పెరిగిందని అధికారులు అభిప్రాయపడ్డారు.



వివరాలు తెలుసుకుంటున్న జెసి మౌర్య భరద్వాజ్

# రాష్ట్రస్థాయిలో సత్తాచాటిన దొరిగల్లు విద్యార్థి మంగళకార్తికేయ

### జాతీయ యోగాసనానికి అడుగులు

**ముదిగుబ్బ, డిసెంబర్ 16:**
ముదిగుబ్బ మండలం దొరిగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి రాష్ట్రస్థాయి యోగాసన పోటీల్లో ప్రతిభను చాటుతూ జాతీయస్థాయికి ఎంపిక కావడం పాఠశాలతో పాటు మండలవ్యాప్తంగా ఆనందోత్సాహాలను నెలకొల్పింది. రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి యోగాసన కాంపిటీషన్స్‌లో 8వ తరగతి చదువుతున్న మంగళకార్తికేయ శ్రీ సత్యసాయి జిల్లా తరఫున సబ్‌జూనియర్ బాయ్స్ విభాగంలో పాల్గొని ఆర్టిస్టిక్ ఫెయిర్ కేటగిరీలో అద్భుత ప్రదర్శనతో రెండో స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థి ఈ స్థాయిలో రాణించడం విశేషమని పాఠశాల వర్గాలు పేర్కొన్నాయి. క్రమశిక్షణతో కూడిన సాధన, ఉపాధ్యాయుల ప్రోత్సాహం, తల్లిదండ్రుల సహకారమే ఈ విజయానికి మూలకారణమని తెలిపారు. ఈ రాష్ట్రస్థాయి విజయంతో మంగళ కార్తికేయ త్వరలో జరగనున్న జాతీయస్థాయి యోగాసన పోటీల్లో పాల్గొననున్నట్లు పాఠశాల సిబ్బంది వెల్లడించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో జరిగిన అభినందన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు లక్ష్మీనారాయణతో పాటు ఉపాధ్యాయ బృందం విద్యార్థిని ఘనంగా సత్కరించారు. జాతీయస్థాయిలోనూ ఇదే ఉత్సాహంతో సాధనచేసి మరింత ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.
ఎంఈఓలు రమణప్ప, వెంకటాచలపతి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న గ్రామీణ విద్యార్థులు రాష్ట్ర, జాతీయస్థాయిల్లో సత్తా చాటగలరని కార్తికేయ నిరూపించాడని ప్రశంసించారు. విద్యార్థి ప్రతిభకు తల్లిదండ్రుల నిరంతర సహకారం, ఉపాధ్యాయుల మార్గనిర్దేశమే ప్రధాన బలం అని సూర్యనారాయణ ఆచారి, నారపరెడ్డి పేర్కొన్నారు. యోగాసనాల్లో సాధించిన ఈ విజయం ఇతర విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తుందని, క్రీడలు%-%యోగాల పట్ల ఆసక్తిని పెంపొందించాల్సిన అవసరం ఉందని పాఠశాల కమిటీ సభ్యులు అభిప్రాయపడ్డారు. దొరిగల్లు పాఠశాల నుంచి జాతీయస్థాయికి వెళ్లనున్న ఈ విజయయాత్ర మండలానికి గర్వకారణంగా నిలిచిందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



విద్యార్థి కార్తికేయ



గురువులతో విద్యార్థి విద్యార్థి కార్తికేయ

## ఘనంగా స్వాతి నక్షత్రం వేడుకలు

### శ్రీ లక్ష్మీ నరసింహ స్వామికి ప్రత్యేక పూజలు..

**అమరాపురం, డిసెంబర్ 16:**
కర్ణాటక రాష్ట్రం పావగడ నియోజకవర్గం నిడుగల్లు పుణ్యక్షేత్రంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయం. శ్రీ స్వాతి నక్షత్రం శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి సందర్భంగా అభిషేకం, కుంకుమార్చన, పంచామృత అభిషేకం, పూలతో అలంకరణ అర్చకులు హరీష్ బట్టర్ . పూజా కార్యక్రమాలు శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి సేవ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. వచ్చిన భక్తాదులకు మహా మంగళహారతి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. అర్చకులు హరీష్ బట్టర్ మాట్లాడుతూ ఈనెల 30 న మంగళవారం శ్రీ లక్ష్మీనరసింహస్వామికి వైకుంఠ ఏకాదశి, ముక్కోటి ద్వాదశి పూజా కార్యక్రమాలు కరికెర కరణం వంశస్థులు,. శ్రీ లక్ష్మీనరసింహస్వామి సేవ ట్రస్ట్ అధ్యక్షులు ప్రసన్న కుమార్, కార్యదర్శి రవి శాస్త్రి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.



శ్రీ లక్ష్మీ నరసింహ స్వామికి అభిషేకం చేస్తున్న దృశ్యం
శ్రీ లక్ష్మీ నరసింహ స్వామికి పూలతో అలంకరణ

## ముదిగుబ్బ-పులివెందుల ఘాట్‌లో రోడ్డు ప్రమాదం

### కారు, ద్విచక్ర వాహనం ఢీ . ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలు..

**ముదిగుబ్బ, డిసెంబర్ 16:**
ముదిగుబ్బ-పులివెందుల ఘాట్ రోడ్డులోని అంబాపల్లి క్రాస్ సమీపంలో మంగళవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదం స్థానికులను కలవరపరిచింది. ముదిగుబ్బ పట్టణానికి చెందిన ఇద్దరు యువకులు ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. దొరిగల్లు రోడ్డులోని మసీదు సమీపంలో నివాసం ఉంటున్న శ్రీకాంత్, గణేష్ క్రికెట్ ఆడేందుకు ముదిగుబ్బ నుంచి ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. ఈ క్రమంలో ఘాట్ రోడ్డులో అంబాపల్లి క్రాస్ వద్ద ఎదురుగా వస్తున్న కారు ఒక్కసారిగా వారి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో ద్విచక్ర వాహనం పల్టీ కొట్టగా ఇద్దరు యువకులు రోడ్డుపై పడిపోయారు. ఈ ప్రమాదంలో శ్రీకాంత్, గణేష్ ్లకు తీవ్ర గాయాలయ్యాయి. ఇది గమనించిన సమీప పొలాల్లో పనిచేస్తున్న రైతులు వెంటనే సహాయక చర్యలు చేపట్టి స్థానికులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న బాధితుల బంధువులు అక్కడికి చేరుకుని గాయపడిన వారిని బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. ఘాట్ రోడ్డులో తరచూ జరుగుతున్న ప్రమాదాలపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వేగ నియంత్రణ చర్యలు చేపట్టాలని, ప్రమాదాలకు కారణమవుతున్న మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులను కోరుతున్నారు.



ప్రథమ చికిత్స చేస్తున్న 108 సిబ్బంది

## అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం

### కోరి లింగన్న మృతికి వైసీపీ నేతలు నివాళులు..

**పెద్దకడబూరు, డిసెంబర్ 16 :**
పెద్దకడబూరు గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్త కోరి లింగన్న గుండెపోటుతో మృతి చెందారని విషయం తెలుసుకున్న వైసీపీ జిల్లా ఉపాధ్యక్షులు ప్రదీప్ రెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి, బూత్ కమిటీ తాలూకా అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, వ్యవసాయ సలహా మండలి మాజీ సభ్యులు గజేంద్రరెడ్డి, మాజీ ఎంపీపీ రఘురామ్, వైసీపీ ప్రచార విభాగం తాలూకా అధ్యక్షులు ముక్కరన్న మంగళవారం మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. కుటుంబ యజమాని కోల్పోయామని అధైర్య పడొద్దని, అండగా ఉంటామని కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు. మట్టి ఖర్చుల కోసం రూ. 15 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు కొరవ సుందరం, బోయ శాంతిరాజు, బోయ రామాంజనేయులు, కుమార్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న వైసీపీ జిల్లా ఉపాధ్యక్షులు ప్రదీప్ రెడ్డి



కోరి లింగన్న మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

## అంగన్వాడీ కేంద్రాల ఆకస్మిక తనిఖీ

**పెద్దకడబూరు, డిసెంబర్ 16 :**
పెద్దకడబూరు గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాలు – 1, 5 లను ఐసీడీఎస్ సూపర్ వైజర్ విజయ కుమారి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అందులోని రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలకు ప్రభుత్వం అందజేసే పౌష్టికాహారాన్ని బాలింతలు, గర్భిణీలు, చిన్నారులకు సక్రమంగా పంపిణీ చేయాలని ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాలకు క్రమం తప్పకుండా చిన్నారులను రప్పించుకొని విద్యాబుద్ధులు నేర్పాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల పరిధిలో ఉన్న గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల వివరాలను యాప్ తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.



అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేసి పలు సూచనలు చేస్తున్న సూపర్ వైజర్ విజయ కుమారి



అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేసి సూచనలు చేస్తున్న సూపర్ వైజర్ విజయ కుమారి

## డి.డి.ఆర్.ఎస్ కింద రూ.112.67 కోట్లు విడుదల

### కేంద్ర సహాయ మంత్రి బి. ఎల్. వర్మ ..

**ఢిల్లీ, డిసెంబర్ 16:**
దీనదయాళ్ దివ్యాంగజన పునరావాస పథకం కింద స్వచ్ఛంద సంస్థల ద్వారా దివ్యాంగులకు పునరావాస సేవలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం గ్రాంట్–ఇన్–ఏయిడ్ విడుదల చేస్తోంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో దివ్యాంగుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం గత ఐదు సంవత్సరాలలో విస్తృత స్థాయిలో నిధులు విడుదల చేసింది. 2020%–%21 నుంచి 2024%–%25 వరకు మొత్తం 241 స్వచ్ఛంద సంస్థలకు డి.డి.ఆర్.ఎస్ పథకం కింద రూ. 112.67 కోట్లు విడుదల చేయగా, 25 వేల 534మంది లబ్ధిదారులు లబ్ధి పొందినట్లు కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి బి. ఎల్. వర్మ వెల్లడించారు.

## గురుకుల పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలి

### ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ..

**రామకుప్పం, డిసెంబర్ 16:**
మండల శివార్లలోని అంబేద్కర్ గురుకుల పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి భాను పేర్కొన్నారు. మంగళవారం స్థానిక నేతలతో కలిసి గురుకుల పాఠశాలలో విద్యార్థుల వసతులపై సమీక్షించారు. హాస్టల్ గదులు, భోజనశాల, మరుగుదొడ్లు, తాగునీరు, ఆటస్థలాలను పరిశీలించి మరింత అభివృద్ధి చేయాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం భోజనాలు తయారు చేయాలన్నారు. ముఖ్యంగా పారిశుద్ధ్యం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పాఠశాల సిబ్బందిని ఆదేశించారు. అనంతరం మండలంలో బంగారు కుటుంబాలను దత్తత తీసుకున్న ఐఏఎస్ రిటైర్డ్ అధికారి భాను మాట్లాడుతూ రాష్ట్రం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరికి అందేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్ష, మాజీ అధ్యక్షులు వెంకటరమణ, ఆంజనేయ రెడ్డి, నియోజవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షుడు నరసింహులు, రెస్కో వైస్ చైర్మన్ విశ్వనాథ్, కడ సభ్యుడు రఘు , మాజీ సర్పంచ్ సీతాపతి, నేతలు బాలు, ఆదిల్, సురేష్, నవీన్, మురళి, శంకరప్ప తదితరులు పాల్గొన్నారు.



గురుకుల పాఠశాలలో మౌలిక వసతులపై సమీక్షిస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ , నేతలు

## వలసలు వద్దు.. ఉపాధి పనులు ముద్దు

### టీడీపీ రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంతరెడ్డి

**పెద్దకడబూరు, డిసెంబర్ 16 :**
వలసలు వద్దు – ఉపాధి పనులు ముద్దు అనే నానుడిని ప్రతి కూలీ సార్థకం చేయాలని టీడీపీ రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంతరెడ్డి పిలుపునిచ్చారు. పెద్దకడబూరు గ్రామంలో వలసలు నివారించేందుకు మంగళవారం గ్రామ సచివాలయం – 2 పరిధిలోని శివారుల్లోని పొలాల్లో టీడీపీ రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంతరెడ్డి, సొసైటీ ఛైర్మన్ మీ సేవ ఆంజనేయులు, కోసిగి మార్కెట్ యార్డ్ ఉపాధ్యక్షులు బొగ్గుల తిక్కన్న, బీసీ సాధికార రాష్ట్ర కమిటీ సభ్యులు మల్లికార్జున కొబ్బరికాయలు కొట్టి ఉపాధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా నరవ రమాకాంతరెడ్డి మాట్లాడుతూ గ్రామంలోని కూలీలందరూ ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. త్వరలో మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పనులను ప్రారంభిస్తామని తెలిపారు. కూలీలు కచ్చితమైన కొలతలతో పనులు చేసి రోజుకు రూ. 321 వేతనం పొందవచ్చునని తెలిపారు. ముఖ్యంగా బినామీలను అరికట్టినట్లయితే మంచి వేతనం పడుతుందన్నారు. వలసలు వెళ్లొద్దని, ఉపాధి పనులకు వెళ్లాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో డీలర్లు గుమ్మల ఆశన్న, ఆదాం, పెద్ద హనుమంతు, కురువ మల్లికార్జున, మంచోది రామన్న తదితరులు తదితరులు పాల్గొన్నారు.



టీడీపీ నేతలను సన్మానిస్తున్న దృశ్యం





ఉపాధి పనులను ప్రారంభిస్తున్న టీడీపీ నేత నరవ రమాకాంతరెడ్డి. ప్రత్యేక పూజలు చేస్తున్న టీడీపీ నాయకులు

## ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరం

### టీడీపీ ఇన్‌చార్జ్ రాఘువేంద్ర రెడ్డి..

**పెద్దకడబూరు, డిసెంబర్ 16 :**
ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరంలాంటిదని మంత్రాలయం టీడీపీ ఇన్ చార్జ్ రాఘవేంద్ర రెడ్డి స్పష్టం చేశారు. పెద్దకడబూరు మండల పరిధిలోని మేకడోణ, కల్లుకుంట, పెద్దకడబూరు, ముచ్చిగిరి, చిన్నతుంబళం గ్రామాలకు చెందిన బాధితులకు మంత్రాలయం మండలం మాధవరం గ్రామంలో టీడీపీ కార్యాలయం నందు టీడీపీ ఇన్ చార్జ్ రాఘువేంద్ర రెడ్డి సీఎం సహాయ నిధి కింద రూ. 1,36,874 చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు అనారోగ్యంతో ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందినట్లయితే అలాంటి బాధితులకు సీఎం సహాయ నిధి కొండంత ఆసరాగా నిలుస్తుందని తెలిపారు. పేదలకు అండగా నిలవడమే లక్ష్యంగా పని చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో చిన్నతుంబళం సొసైటీ ఛైర్మన్ కందనాతి నరసప్ప, సాగునీటి సంఘం అధ్యక్షులు సత్యన్న గౌడ్, బూత్ యూనిట్ కన్వీనర్ తలారి అంజీ, యూనిట్ ఇన్ చార్జ్ దుమ్మల శివ, టీడీపీ నాయకులు రాఘవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ చేస్తున్న టీడీపీ ఇన్ చార్జ్ రాఘువేంద్ర రెడ్డి



ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ చేస్తున్న టీడీపీ ఇన్ చార్జ్ రాఘువేంద్ర రెడ్డి

## జేఏసీ ఆధ్వర్యంలో ఆదోని జిల్లా సాధన స్టిక్కర్ ఆవిష్కరణ

### మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ జైన్ ..

**ఆదోని. డిసెంబర్ 16:**
ఆదోని జిల్లా సాధన కోసం జేఏసీ కన్వీనర్, మాజీ ఎమ్మెల్యే ఎన్. ప్రకాష్ జైన్ ఆధ్వర్యంలో దీక్ష శిబిరం వద్ద స్టిక్కర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులంతా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ జైన్ మాట్లాడుతూ, ఆదోని జిల్లా సాధించే వరకు ఈ ఉద్యమం నిరంతరం కొనసాగుతుందని స్పష్టం చేశారు. అలాగే ఆటోలు, కార్లు, బస్సులు, లారీలు, ద్విచక్ర వాహనాలపై జిల్లా స్టిక్కర్లను అతికించి ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు ఐక్యంగా ఈ ఉద్యమంలో పాల్గొనాలని ఆయన కోరారు. ఈరోజు దీక్షకు బిల్డింగ్ కార్మికులు కూర్చుండగా, ప్రతిరోజూ ఒక్కో కార్మిక సంఘం దీక్షకు సంఘీభావం తెలుపుతూ పాల్గొంటోంది. ఈ సందర్భంగా కార్మికులు, జేఏసీ సభ్యులు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆలోచించి ఆదోని జిల్లాను ప్రకటిస్తే ఆదోని, మంత్రాలయం, పత్తికొండ, ఆలూరు, ఎమ్మిగనూరు ప్రాంత ప్రజల తరపున కృతజ్ఞతలు తెలుపుకుంటాం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు, కార్మిక సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ జైన్ .స్టిక్కర్స్ విడుదల చేస్తున్న దృశ్యం

## రెండు చుక్కలతో పోలియో మహమ్మారిని తరిమికొడదాం

### పల్స్ పోలియోపై అవగాహన సదస్సు..

**పెద్దకడబూరు, డిసెంబర్ 16 :**
చిన్నారులకు రెండు పోలియో చుక్కలు వేసి పోలియో మహమ్మారిని తరిమికొడదామని వైద్యాధికారులు ఫిరదౌస్, కేజియా పిలుపునిచ్చారు. మంగళవారం పెద్దకడబూరు గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు ఆరోగ్య సిబ్బంది, ఐసీడీఎస్ సిబ్బంది, ఆశా వర్కర్లకు పల్స్ పోలియో కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాలలో 0 నుంచి 5 సంవత్సరాలలోపు పిల్లలు 8325 మంది ఉన్నారని గుర్తు చేశారు. వీరికి ఈ నెల 21న ఆదివారం పోలియో చుక్కలు వేయించి అవిటితనాన్ని దరికి రాకుండా తరిమి కొట్టాలని కోరారు. మండలంలో మొత్తం 32 పోలియో కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. అలాగే ఒక మొబైల్ టీం పని చేస్తుందని తెలిపారు. ఆరోగ్య సిబ్బంది, ఐసీడీఎస్ సిబ్బంది, ఆశా వర్కర్లు పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ సీఓ శ్రీధర్, ఎంఈఓ – 1 ఉస్మాన్ బాషా, ఆర్ఐ జెర్మియా, ఐసీడీఎస్ సూపర్ వైజర్ విజయ కుమారి, పీహెచ్సీ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైద్యాధికారిణి ఫిరదౌస్





కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీహెచ్ సీఓ శ్రీధర్, ఐసీడీఎస్ సూపర్ వైజర్ విజయ కుమారి



మాట్లాడుతున్న ఎస్ఐ నిరంజన్ రెడ్డి

## మహిళపై దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు

### ఎస్ఐ నిరంజన్ రెడ్డి ..

**పెద్దకడబూరు, డిసెంబర్ 16 :**
పెద్దకడబూరు మండల పరిధిలోని చిన్నతుంబళం గ్రామానికి చెందిన బుడిజగ్గుల లక్ష్మి అనే మహిళపై అదే గ్రామానికి చెందిన రాజు దాడి చేసిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నిరంజన్ రెడ్డి మంగళవారం విలేకరులకు తెలిపారు. పాత గొడవలను దృష్టిలో పెట్టుకుని లక్ష్మి ఇంటిలోకి రాజు ప్రవేశించి కాళ్లు చేతులతో కొట్టి అసభ్యకరంగా దూషించినట్లు తెలిపారు. బాదితురాలు లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

## మాజీ ఎంపీటీసీ సభ్యులు బోయ తిప్పయ్య మృతి

**పెద్దకడబూరు, డిసెంబర్ 16 :**
పెద్దకడబూరు గ్రామంలోని చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యులు బోయ తిప్పయ్య అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. 2004లో కాంగ్రెసు ప్రభుత్వ హయాంలో పెద్దకడబూరు ఎంపీటీసీ – 2 స్థానం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి బోయ తిప్పయ్య విజయం సాధించారు. గత మూడేళ్ల క్రితం బోయ తిప్పయ్య పక్షవాతం జబ్బుతో మంచం పట్టారు. ఈ జబ్బు నుంచి కోలుకోలేక మృత్యువాత పడ్డారు. దీంతో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. మాజీ ఎంపీటీసీ సభ్యులు బోయ తిప్పయ్య మృతిపై పలువురు సంతాపం వ్యక్తం చేశారు.





రైతులకు ఉలవలు పంపిణీ చేస్తున్న కూటమి నేతలు

## రాయితీ ఉలవలు పంపిణీ

**రామకుప్పం, డిసెంబర్ 16:**
రాష్ట్ర ప్రభుత్వం ఉలవలను రైతులకు రాయితీతో కూటమి నేతలు పంపిణీ చేశారు. మంగళవారం మండలంలోని అనిగానూరు సచివాలయ రైతు సేవ కేంద్రంలో లబ్ధిదారులకు 5 కేజీల చొప్పున అందజేశారు. రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యంగా అన్ని విధాల సంక్షేమాలను అందిస్తోందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇంచార్జ్ రామ్మూర్తి, ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ డైరెక్టర్ జయశంకర్, మనేష్, కృష్ణారెడ్డి ,మహేంద్ర నాయుడు, రామలింగం, గోపాల్ రెడ్డి, మురుగేష్, ఏవో మహేష్, రైతులు పాల్గొన్నారు.



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న మండల ప్రధాన కార్యదర్శి ఉగ్రేగౌడ్

## గ్రామస్థాయిలో పార్టీ బలోపేతం దిశగా పని చేయాలి

**రోళ్ల, డిసెంబర్ 16 :**
గ్రామస్థాయిలో పార్టీ బలోపేతం దిశగా పని చేయాలాని శిక్షకులు తెలిపారు. రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో రెండవ రోజైన మంగళవారం మండల పార్టీ అధ్యక్షులకు ప్రధాన కార్యదర్శులకు1) చంద్రశేఖర్ టీమ్ మెంబర్ కార్యకర్తల సంక్షేమం గురించి వివరించారు. రాష్ట్ర అధికార ప్రతినిధి మేక ఆనంద సాగర్ సూపర్ సిక్స్ అమల గురించి వివరించారు .3) కోట అనిల్ కుమార్ సోషల్ మీడియా గురించి వివరించడం జరిగింది 4)శ్రీ గణబాబు శాసనసభ్యులు ప్రభుత్వ విప్ టిడిపి సంస్థగత పార్టీ విదానాల గురించి వివరించారు. ఈకార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు జి కె ఈరన్న, మండల ప్రధాన కార్యదర్శి ఉగ్రేగౌడ్ పాల్గొన్నారు.



శిక్షణ తరగతులకు హాజరైన మండల పార్టీ అధ్యక్షులు నాగరాజు
మండల ప్రధాన కార్యదర్శి ఉగ్రేగౌడ్


సిబ్బందికి సూచనలు ఇస్తున్న సిఐ దస్తగిరి

## చింతకుంటలో నాకాబందీ

**ముద్దనూరు, డిసెంబర్ 16:**
ఫ్యాక్షన్ గ్రామమైన చింతకుంటలో సిఐ దస్తగిరి తన సిబ్బందితో నాకాబందీ నిర్వహించారు. ఉన్నతాధికారుల ఆదేశానుసారం నిర్వహించిన నాక బందిలో గ్రామంలోని పలు ప్రాంతాలను తనిఖీ చేశారు. అనంతరం బైకు వాహన చోదకులకు హెల్మెట్ ధరించాలని, ప్రత్యక్షంగా తన సిబ్బందికి హెల్మెట్ ధరింపజేసి ప్రతి ఒక్కరూ హెల్మెట్స్ వాడితే సేఫ్టీగా ఇంటికి చేరతారని పరోక్షంగా ప్రజలకు ఓ మెసేజ్ పంపారు.



నాకాబందీకి వెళ్తున్న పోలీసులు

## నెల రోజులు ఒకే గ్రామంలో గ్రామసభలు

**తహసీల్దార్ సోమల నాయక్..**

**సంగం, డిసెంబర్ 16:**
. ప్రజా సమస్య పరిష్కార వేదికలలో గ్రామీణ ప్రాంతాల నుండి ఎక్కువ దరఖాస్తులు వస్తున్నాయని వాటిని సంబంధిత రెవిన్యూ అధికారులు పరిష్కరించేందుకు ఒక్కొక్క గ్రామంలో నెలరోజులపాటు నాలుగు విడతలగా గ్రామసభల నిర్వహించాలన్న జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు సంగం తహసీల్దార్ సోమల నాయక్ వెల్లడించారు. ఆత్మకూరు డివిజన్, సంగం మండలంలోని ప్రజలందరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని తమ సమస్యలను పరిష్కరించుకోవాలని వెల్లడించారు. గ్రామములలో నెలకొన్న రెవెన్యూ మరియు ఇతర సమస్యల శాశ్వత పరిష్కారము కొరకు ఈ నెల అనగా డిశెంబరు-2025వ మాసము నుండి ప్రతి నెల ఒక గ్రామము నందు 4 పర్యాయాలు సందర్శించి (వన్ మంత్ వన్ విలేజ్ 4 విజిట్స్ కార్యక్రమం)లో భాగంగా ఆయా గ్రామాల్లోని రెవెన్యూ, ఇతర సమస్యలపై సమీక్ష జరిపి ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించి, త్వరితగతిన పరిష్కారం కోసం ప్రజల ముంగిటకే యంత్రాంగాన్ని తీసుకెళ్లాలని తలపెట్టిన ఈ బృహత్కర కార్యక్రమానికి సంబంధించి మండలంలో ఉన్న రెవెన్యూ గ్రామాల్లో ఏ మాసంలో గ్రామసభ నిర్వహించాలో షెడ్యూల్ ను ఖరారు చేశామన్నారు. మొదటిగా వంగల్లు గ్రామంలో ఈ నెలలో గ్రామసభలు జరుగుతాయని ఆయన అన్నారు.




పల్స్‌పోలియోపై వివరిస్తున్న వైద్యాధికారులు సాయికుమార్, గౌతమీ

## పల్స్ పోలియో విజయవంతం చేయాలి

**హిరమండలం, డిసెంబర్ 16:**
హిరమండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఈనెల 21, 22 ,23 తేదీలో నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు పాల్గొని విజయవంతం చెయ్యాలని వైద్యాధికారులు సాయికుమార్, గౌతమీ కోరారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారి మాట్లాడుతూ అప్పుడు పుట్టిన పసిపిల్లలు నుండి ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని తెలిపారు. పిహెచ్సి పరిధిలో 1255 పిల్లలు ఉన్నారని చెప్పారు. వీరికి పోలియో చుక్కలు వేసేందుకు 13 బూతులు,26 బృందాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదిలక్ష్మి ,రోజారమని, ఏఎన్ఎంలు, ఎమ్ఎల్ హెచ్ పి లు, హెల్త్ అసిస్టెంట్స్, అంగన్వాడీ కార్యకర్తలు,ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## ఆక్వా కల్చర్ అభివృద్ధికి సంపూర్ణ సహకారం

**మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు..**

**అమరావతి, డిసెంబర్ 16:**
రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు ఆక్వా రంగం కీలకమైన ఆధారంగా మారిందని, ఆక్వా కల్చర్ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తోందని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, మత్స్య శాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. మంగళవారం కృష్ణా జిల్లా పెనమలూరులోని మత్స్య శాఖ కార్యాలయంలో రాష్ట్ర ఆక్వాకల్చర్ అభివృద్ధి అధికార సంస్థ పాలకవర్గ సభ్యుల ప్రమాణస్వీకార కార్యక్రమానికి మంత్రి అచ్చెన్నాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు.

# పురుగు నివారణకు వేప నూనె పిచికారి చేయాలి

**వ్యవసాయ అధికారి వెంకట కృష్ణారెడ్డి ..**

**ముద్దనూరు, డిసెంబర్ 16:**
పంటను ఆశించిన పురుగును(తెగులును) తప్పనిసరిగా వేప నూనెతో పిచికారి చేయాలని మండల వ్యవసాయ అధికారి వెంకటకృష్ణారెడ్డి పేర్కొన్నారు. రైతులు రబీ సీజన్లో వేసిన పంటలను తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని అయన పేర్కొన్నారు. కొత్తపల్లె గ్రామంలో రైతు సేవా కేంద్రంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ అవసరం మేరకే క్రిమిసంహారకమందులను ,సిపారస్ చేసిన మేరకే వాడుకోవాలి అని సూచించారు. తదుపరి గ్రామంలో సాగుచేసిన కంది,శనగ పంటలను పరిశీలించి రైతులకు తగు సూచనలు సలహాలు అందించినట్లు తెలిపారు. శనగ పంట పొలంలో అక్కడక్కడ ఎండు తెగులు ఆశించింది అని తెలిపారు. దీని నివారణకు పూత దశకు వచ్చిన పంటలో పురుగు


మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి వెంకట కృష్ణారెడ్డి ..

నివారణకువేపనూనె వాడకం ప్రతి పంటలో ప్రతి సారి ఉపయోగించాలి అన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు మోహన్ రెడ్డి,వెంకట రామిరెడ్డి, రమేష్ రెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకురాలు ఇల్లూరి సుచరిత తదితరులు పాల్గొన్నారు.

# డంపింగ్ యార్డ్‌గా ఎల్ఎన్ పేట రహదారి!

**అధికారుల చెంతే అపరిశుభ్రత ..**

**ఎల్ఎన్ పేట, డిసెంబర్ 16:**
డంపింగ్ యార్డ్ గా ఎల్ ఎన్ పేట రహదారి తయారు కావడం ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎల్ ఎన్ పేట జంక్షన్ ఇటీవల వ్యాపార కేంద్రం గా అభివృద్ధి చెందడం ఖాళీ కొబ్బరి కాయలు,ప్లాస్టిక్ వస్తువుల, కూరగాయలు,చెత్త సామాగ్రి తరలించి రహదారి కి ఇరువైపుల వేస్తున్నారు. జంక్షన్ నుండి పెద్ద కోట గ్రామ రహదారి జంక్షన్ వరకు కుప్పలు తెప్పలుగా చెత్త ఇరువైపుల దర్శిని మిస్తుంది. ఈ రహదారి గుండా పెద్ద కోట, లక్ష్మీ నర్సు పేట, మిరియాపల్లి,వాడవలస,దబ్బపాడు గ్రామస్తులు, విద్యార్థులు, ఉద్యోగులు రాక పోకలు సాగిస్తున్నారు. అలాంటి రహదారి లో కుళ్ళిన చెత్త చెదారం తో దుర్గంధం వెదజెల్లుతుండం


రహదారికి ఇరువైపులా పేరుకున్న చిత్త కుప్పలు


రహదారి పక్కన చిత్త కుప్పలు

పాదచారులు, ప్రయాణీకులు, వాహనాలు చోదకులు ముక్కు మూసుకొని వెళ్లవలిసిన పరిస్థితులు నెలకొంటున్నాయి. వర్షాకాలం మరిన్ని సమస్యలు ఏర్పడుతున్నాయి. నీటి ప్రవాహానికి రహదారి ప్రక్కన పంట పొలాల్లో పలు రకాల చెత్త సామాగ్రి చేరడం పంటలకు నష్టం వాటిల్లుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీటిని తొలిగించి డానికి ఆర్థిక వ్యయప్రయాసాల కు గురి కావాల్సి పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. అధికారులకు కూత వేటు దూరంలో రహదారి ఇరువైపుల అపరిశుభ్రత దర్శినమిస్తున్న తమకు పట్టని విధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పరిసరాల పరిశుభ్రత తో ఆరోగ్యకరమైన జీవన మని అధికారులు ప్రజాప్రతినిధులు వేదికల పై ఉపన్యాసం ఇస్తున్న,అపరిశుభ్రమైన రహదారి పై చర్యలు ఎక్కడని ప్రశ్నలు విన్పిస్తున్నాయి. ఇప్పటకైన అధికారులు , ప్రజాప్రతినిధులు స్పందించి రహదారి ప్రక్కన చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# షాలేము మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

**ఎమ్మెల్యే కాకర్ల..**

**ఉదయగిరి(వరికుంటపాడు), డిసెంబర్ 16:**
వరికుంటపాడు మండలం జడదేవి గ్రామంలో షాలేము మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకలు ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ ముఖ్య అతిథిగా పాల్గొని వేడుకలకు ప్రత్యేక శోభను చేకూర్చారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు,చర్చి పాస్టర్లు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ను పూలమాలలతో, శాలువాతో ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ క్రిస్మస్ పండుగ అనేది శాంతి, ప్రేమ, కరుణ, దయ వంటి మానవీయ విలువలను ప్రపంచానికి చాటిచెప్పే మహత్తర వేడుక అని అన్నారు. ఇటువంటి సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొనడం తనకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని తెలిపారు. ఈ సందర్భంగా క్రైస్తవ సోదర సోదరీమణులకు ముందస్తుగా క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేస్తూ, పండుగలు సమాజంలో ఐక్యతను పెంపొందించే సాధనమని పేర్కొన్నారు.



మిఠాయిలు అందిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

అనంతరం ఎమ్మెల్యే కాకర్ల సురేష్ చేతుల మీదుగా నూతన క్యాలెండర్లను ఆవిష్కరించి, చర్చి పాస్టర్లకు నూతన వస్త్రాలను బహుమతిగా అందజేశారు. కూటమి ప్రభుత్వం పాస్టర్ల సేవలను గుర్తించి నెలకు రూ. 5,000 గౌరవ వేతనం అందిస్తోందని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ఇది ప్రభుత్వానికి అన్ని మతాల పట్ల ఉన్న సమాన గౌరవానికి నిదర్శనమని అన్నారు. గ్రామాలలో నివసించే ప్రజలంతా మతభేదాలు మరిచి సర్వమత సౌభ్రాతృత్వంతో అన్ని పండుగలను కలిసి జరుపుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. సమైక్యతే సమాజ అభివృద్ధికి పునాది అని పేర్కొన్నారు. అదేవిధంగా, కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం క్రిస్మస్ వేడుకల సందర్భంగా నియోజకవర్గంలోని అన్ని చర్చిలకు స్వీట్లు, తినుబండారాలను అందజేస్తున్నామని, ఈ సంవత్సరం కూడా అదే సంప్రదాయాన్ని కొనసాగిస్తూ వాటిని అందజేయనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో చర్చి పాస్టర్లు, క్రైస్తవ సంఘ సభ్యులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

# విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

**బుచ్చిరెడ్డి పాలెంలో వాలీబాల్ పోటీలు ప్రారంభం..**
**ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ..**

**నెల్లూరు, డిసెంబర్ 16:**
ఎప్పుడూ నాలుగు గోడల మధ్య చదువులే కాకుండా విద్యార్థులను క్రీడల దిశగా ప్రోత్సహించాలని ఉపాధ్యాయులకు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి సూచించారు. బుచ్చిరెడ్డి పాలెం పట్టణం డిఎల్ఎన్ఆర్ కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన 69 వ రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలను ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె వాలిబాల్ కోర్టులో బంతి ఎగురవేసి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. అనంతరం ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ క్రీడాకారుల మధ్య పరస్పర సహకారం, కష్టపడే స్వభావం వుంటేనే వాలిబాల్ లాంటి క్రీడలో రాణించ గలుగుతారన్నారు. క్రీడలలో గెలుపు ఓటములు సహజమేనని, గెలిచినా, ఓడినా, ప్రయత్నాన్ని మాత్రం ఎప్పటికీ ఆపకూడదన్నారు. నెల్లూరు జిల్లా మీద నమ్మకంతో 12 జిల్లాల నుంచి వాలీబాల్ పోటీలకు పిల్లలను పంపిన వారి తల్లి తండ్రులను ఆమె అభినందించారు. బుచ్చిరెడ్డి పాలెంలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి పోటీలలో విజేతలై కడపలో జరిగే నేషనల్స్ లో ఎంపిక కావాలని క్రీడాకారులకు ఆమె ఆశీర్వచనాలు అందచేశారు.


క్రీడాకారుల గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి

కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చాక విద్యతో పాటు క్రీడలను కూడా ప్రోత్సాహకాలు అందచేస్తుందన్నారు. విద్యా శాఖ మంత్రి లోకేష్ గారి ఆధ్వర్యంలో క్లాస్ కు ఒక టీచర్ విధానం, పాఠశాలలో నాణ్యమైన భోజనం, నాణ్యమైన బ్యాగులు, స్టడీ కిట్ల గురించి వివరించారు. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన పిటిఎం గురించి ఆమె మాట్లాడుతూ విద్యార్థులు, తల్లితండ్రులు మరియు ఉపాధ్యాయుల మధ్య సమన్వయం అవసరమన్న విషయాన్ని మంత్రి లోకేష్ గారు గుర్తించి పేరెంట్స్ టీచర్స్ మీటింగ్స్ గురించి ఆమె తెలిపారు. నెలలో రెండు సార్లు ప్రజా ప్రతినిధులు విద్యాలయాలను సందర్శించి బోధన మరియు విద్యార్థుల స్థితిగతులను పర్యవేక్షించాలని కోరారు. క్రీడల అభివృద్ధికి కృషి చేస్తున్న ఎస్‌జీఎఫ్ అధికారులు, నిర్వాహకులు, కోచ్‌లు, ఉపాధ్యాయులు మరియు తల్లిదండ్రులకు ఆమె అభినందనలు తెలిపారు. క్రీడా మైదానాలలో సదుపాయాలు మరింత మెరుగు పరిచేందుకు కృషి చేస్తానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి హామీ యిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్పోర్ట్స్ కమిషనర్ అన్వర్ భాష, సీఐ శ్రీనివాసులురెడ్డి, మున్సిపల్ ఛైర్ పర్సన్ మోర్ల సుప్రజ, టిడిపి సీనియర్ నాయకులు కోడూరు కమలాకర్ రెడ్డి, దువ్వూరు కళ్యాణ్ రెడ్డి,టిడిపి పట్టణ గుత్తా శ్రీనివాసులు, మాజీ పట్టణ అధ్యక్షులు ఎంవి శేషయ్య, మున్సిపల్ కౌన్సిలర్లు, టిడిపి నాయకులు కార్యకర్తలతో పాటు బిజెపి,జనసేన నాయకులు పాల్గొన్నారు.


విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న ఎంఈఓ రమణయ్య

## ఘనంగా అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం

**మండల విద్యాశాఖ అధికారి రమణయ్య..**

**దువ్వూరు, డిసెంబర్ 16:**
దువ్వూరు ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలోని భవిత పాఠశాలలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఈఓ రమణయ్య పాల్గొని దివ్యాంగుల విద్యార్థులకు ప్రభుత్వం కల్పించే రాయితీలు వారి యొక్క హక్కులు, చట్టాల గురించి తెలియజేశారు. దివ్యాంగుల తల్లిదండ్రులు వారి పిల్లల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు మరియు భవిత పాఠశాలలో కల్పించే సౌకర్యాల గురించి తెలియజేశారు. జిల్లాస్థాయిలో దివ్యాంగుల ఆటల పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల ఎస్టియు అధ్యక్షులు బాబు, ఉపాధ్యాయులు వీరాస్వామి, విజయ, ఎం ఐ ఎస్, ఖదీర్, శరత్, సి ఆర్ పి, రఘురాం, దివ్యాంగుల తల్లిదండ్రులు ఆయాలు పాల్గొన్నారు.


ప్రసన్నకుమార్ రెడ్డికి పూలమొక్క అందజేస్తున్న మావులూరు

## మాజీమంత్రి ప్రసన్నను కలిసిన మావులూరు

**నెల్లూరు, డిసెంబర్ 16:**
మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వై.యస్ జగన్ మోహన్ రెడ్డిఆదేశానుసారం వైసీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన మావులూరు శ్రీనివాసులురెడ్డి మాజీ మంత్రి, వైసీపీ రాష్ట్రపిఎసి సభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డిని నెల్లూరులోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను బహుకరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో ఎపిడిఎల్ డి ఎ ఛైర్మన్ గొల్లపల్లి విజయ కుమార్,వైసీపీ నాయకులు అంగా ఫకీరయ్య పాల్గొన్నారు.

## రీ సర్వేతో రైతుల భూసమస్యలు తక్షణ పరిష్కారం

**ఆర్డీవో నాగ సంతోషిణి అనూష ..**

**నెల్లూరు, డిసెంబర్16:**
రీ-సర్వేతో రైతుల భూసమస్యలు తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని ఆర్డీవో నాగ సంతోషిణి అనూష అన్నారు నెల్లూరు జిల్లా ఇందుకూరుపేట మండలం గంగపట్నం పంచాయతీ కార్యాలయం లో మంగళవారం మండల తహసీల్దార్ మురళి ఆధ్వర్యంలో రీ-సర్వే ప్రాజెక్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో నాగ సంతోషిణి అనూష పాల్గొన్ని రైతుల నుండి అర్జీలు స్వీకరించారు ఈ సందర్భంగా ఆర్డిఓ మాట్లాడుతూ రైతులకు భూసమస్యలు ఉంటే వాటిని సత్వరమే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. గతంలో జరిగిన సర్వేలో తప్పులు జరిగి ఉంటే మళ్లీ జరుగుతున్న రీసర్వేలోసరిచేసుకోవాలని,రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా త్వరితగతిన సర్వే పూర్తి చెయ్యాలని మండల అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో, ఆర్ ఐ. శ్రీకాంత్, మండల సర్వేర్ శ్రీనివాసులు రెడ్డి , మండల బీసీ సెల్ అధ్యక్షులు మారుబోయిన జనార్ధన్ గౌడ్, బిజెపి మండల ఉపాధ్యక్షులు కేతిరెడ్డి అవినాష్ రెడ్డి, వీఆర్వో జ్యోతి, ఏపీఎం షరితా రెడ్డి, సర్వేయర్లు, రైతులు స్థానిక నాయకులు,తదితరులు పాల్గొన్నారు.


రీ-సర్వే కార్యక్రమం నిర్వహించిన ఆర్డీవో నాగ సంతోషిణి అనూష

## ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి

**ఎమ్మెల్యే కాకర్ల..**

**ఉదయగిరి(వింజమూరు), డిసెంబర్ 16:**
ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్న ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ తన క్యాంపు కార్యాలయంలో ప్రజలతో నేరుగా సమావేశమై వారి అర్జీలు, సమస్యలను స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యాలయానికి వచ్చిన వివిధ గ్రామాల ప్రజలు ఎమ్మెల్యే ను కలిసి తమ వ్యక్తిగత, సామాజిక సమస్యలను వివరించారు. ప్రజలు వినిపించిన ప్రతి సమస్యను ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఎంతో శ్రద్ధగా, ఓర్పుతో విని, వాటి తీవ్రతను అర్థం చేసుకున్నారు. అనంతరం సంబంధిత శాఖల అధికారులతో తక్షణమే ఫోన్ ద్వారా మాట్లాడి, సమస్యలపై పూర్తి వివరాలు తెలియజేస్తూ వీలైనంత త్వరగా పరిష్కారం చేపట్టాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రజల సమస్యలకు ప్రాధాన్యత ఇచ్చి, ఆలస్యం లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే స్పందనపై ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి, వారి సమస్యలను తన సమస్యలుగా భావిస్తూ పరిష్కారానికి కృషి చేయడమే తన లక్ష్యం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు వివిధ గ్రామాల అర్జీదారులు తదితరులు పాల్గొన్నారు.


రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాకర్ల


ప్రజల సమస్యలు వింటున్న ఎమ్మెల్యే కాకర్ల



విద్యార్థినులకు ఆధార్ నమోదు చేస్తున్న దృశ్యం

# ముదిగుబ్బ మండలంలో ఆధార్ స్పెషల్ క్యాంపులు

**ఎంఈఓ రమణప్ప..**

**ముదిగుబ్బ, డిసెంబర్ 16:**
ముదిగుబ్బ మండలంలోని పలు గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఆధార్ అప్‌డేట్స్ కోసం ప్రత్యేక క్యాంపులు నిర్వహించనున్నట్లు మండల పరిపాలనా కార్యాలయం ప్రకటించింది. %+ూ%ొ% విభాగం ఆదేశాల మేరకు డిసెంబర్ 16 నుంచి 24 వరకు ఈ క్యాంపులు జరగనున్నట్లు తెలిపారు. డిసెంబర్ 16, 17 తేదీల్లో ముదిగుబ్బ, ఎనుములవరిపల్లి, అడవి బ్రాహ్మణపల్లి తండా గ్రామాల్లో, డిసెంబర్ 18, 19 తేదీల్లో మల్లెపల్లి, దొరిగల్లు, సంకేపల్లి గ్రామాల్లోను, డిసెంబర్ 20, 21 తేదీల్లో రామస్వామి తండా, మంగళమడక, గాండ్లవారిపల్లి లోనూ డిసెంబర్ 22న గుడ్డంపల్లి తండా, జొన్నలకొత్తపల్లి, ముక్తాపురం గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు క్యాంపులు నిర్వహిస్తారు. ఈ క్యాంపుల్లో పేరు, చిరునామా, జననతేదీ, ఫోటో, బయోమెట్రిక్ వంటి ఆధార్ అప్‌డేట్స్ చేయించుకోవచ్చని ఎంఈఓ రమణప్ప తెలిపారు. సంబంధిత గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ ప్రత్యేక క్యాంపులను మంగళవారం ముదిగుబ్బ మండల విద్యాశాఖ అధికారి 2 రమణప్ప పర్యవేక్షించారు. ముదిగుబ్బ బాలికల ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న డిజిటల్ అసిస్టెంట్ తిరుపతమ్మ, డబ్ల్యూఈఏ హేమలత తో వాటి పనితీరు గూర్చి పారా తీశారు. విద్యార్థులకు ఆధార్ అప్డేట్ లో ఏవేని సమస్యలు తలెత్తితే వెంటనే సమీపంలోని తమ కార్యాలయానికి సమాచారం ఇవ్వాలని సూచించారు.

# కల్లుమర్రి లో హెలికాప్టర్ ల్యాండింగ్ స్థలం పరిశీలన

**పెనుగొండ డిఎస్పి నర్సింగరావు..**

**రోళ్ల, డిసెంబర్ 16 :**
మడకశిర మండలం కల్లుమర్రిలో హెలికాప్టర్ ల్యాండింగ్ స్థలాన్ని మంగళవారం పెనుగొండ డిఎస్పి నర్సింగరావు పరిశీలించారు. మడకశిర శాసనసభ్యులు ఎం యస్ రాజు మాజీ శాసనమండలి సభ్యులు గుండుమల తిప్పేస్వామి ఆదేశాల మేరకు మడకశిర మండలం కల్లుమర్రి హైస్కూల్ లో హెలికాప్టర్ ల్యాండింగ్ స్థల పరిశీలన చేస్తున్న పెనుగొండ డిఎస్పి నర్సింగరావు మండల కన్వీనర్ కల్లుమర్రి నాగరాజు ఆర్ అండ్ బి డి ఈ



హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలిస్తున్న దృశ్యం.
డి ఎస్ పి నరసింగప్పను సన్మానిస్తున్న మండల పార్టీ కన్వీనర్ నాగరాజు

# శ్రీ సత్యసాయి జిల్లా టిడిపి అధ్యక్షులుగా ఎమ్మెల్యే రాజు

**అభినందించిన వివం పాండురంగప్ప ..**

**రోళ్ల, డిసెంబర్ 16 :**
శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షులుగా నియమితులైన మడకశిర నియోజకవర్గం ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యుడు ఎం ఎస్ రాజుకి రాష్ట్ర వక్కలిగా సాధికార కన్వీనర్ వివం పాండురంగప్ప హృదయపూర్వక శుభకాంక్షలు తెలిపారు. భవిష్య తులో మరిన్ని ఉన్నత పధవులు పొందాలని ఆకాక్షించారు.



# ఎమ్మెల్యే రాజుకి శుభకాంక్షలు

**మీనాక్షి ముద్దరాజు ..**

**రోళ్ల, డిసెంబర్ 16 :**
శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షులుగా నియమితులైన మడకశిర నియోజకవర్గం ఎమ్మెల్యే టీటీడీ బోర్డు సభ్యుడు ఎం ఎస్ రాజుకి మడకశిర మార్కెట్ యార్డ్ డైరెక్టర్ మీనాక్షి ముద్దరాజు శుభకాంక్షలు తెలిపారు. భవిష్య తులో మరిన్ని ఉన్నత పధవులు పొందాలని వారు ఆకాక్షించారు. ఈసందర్బంగా వారు మాట్లాడుతూ మడకశిర నియోజకవర్గం అభివృద్ధి లో ఎమ్మెల్యే ఎం ఎస్ రాజు కీలక భూమిక పోషిస్తున్నారని పేర్కొన్నారు.



ఎమ్మెల్యే రాజుని సన్మానిస్తున్న సీనియర్ నాయకులు ముద్దరాజు
శుభాకాంక్షలు తెలుపుతున్న మార్కెట్ యార్డ్ డైరెక్టర్ మీనాక్షి ముద్దరాజు

# ఎమ్మెల్యే రాజుకి శుభకాంక్షలు

**మండల ప్రధాన కార్యదర్శి విశ్వనాథ్ యాదవ్..**

**రోళ్ల, డిసెంబర్ 16 :**
శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షులుగా నియమితులైన మడకశిర నియోజకవర్గం ఎమ్మెల్యే టీటీడీ బోర్డు సభ్యుడు ఎం ఎస్ రాజుకి అగళి మండల ప్రధాన కార్యదర్శి విశ్వనాథ్ యాదవ్ శుభకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు పొందాలని ఆకాక్షించారు.



# ఎమ్మెల్యే ఎం ఎస్ రాజుకు ఘన సన్మానం

**శుభకాంక్షలు తెలిపిన జి కె ఈరన్నా, ఉగ్రేగౌడ్**

**రోళ్ల, డిసెంబర్ 16 :**
శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షులుగా నియమితులైన మడకశిర నియోజకవర్గం ఎమ్మెల్యే టీటీడీ బోర్డు సభ్యుడు ఎం ఎస్ రాజుకి మంగళవారం కేంద్ర తెలుగుదేశం పార్టీ కార్యాలయం లో మండల పార్టీ అధ్యక్షులు జి కె ఈరన్న, మండల ప్రధాన కార్యదర్శి ఉగ్రేగౌడ్ ఘనంగా సన్మానించి శుభకాంక్షలు తెలిపారు. భవిష్య తులో మరిన్ని ఉన్నత పధవులు పొందాలని వారు ఆకాక్షించారు. ఈసందర్బంగా వారు మాట్లాడుతూ మడకశిర నియోజకవర్గం అభివృద్ధి లో ఎమ్మెల్యే ఎం ఎస్ రాజు కీలక భూమిక పోషిస్తున్నారని పేర్కొన్నారు.





# 10వ తరగతి 100 రోజుల ప్రత్యేక కార్యక్రమం పరిశీలన

**ముదిగుబ్బ, డిసెంబర్ 16:**
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 10వ తరగతి 100 రోజుల ప్రత్యేక కార్యక్రమం అమలును ముదిగుబ్బ మండల విద్యాశాఖాధికారి (ఎంఈఓ2) రమణప్ప మంగళవారం మండలంలోని దొరిగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పరిశీలించారు. పదో తరగతి విద్యార్థుల విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపడేలా రూపొందించిన ఈ కార్యక్రమం అమలు తీరును ఎంఈఓ సమీక్షించారు. ఈ సందర్భంగా తరగతుల్లో జరుగుతున్న బోధన విధానాలను పరిశీలించిన ఎంఈఓ రమణప్ప, విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి పాఠ్య అవగాహన స్థాయిని తెలుసుకున్నారు. ముఖ్యంగా తెలుగు, ఇంగ్లిష్, గణితం, సైన్స్ వంటి ప్రధాన విషయాలలో విద్యార్థుల ప్రగతిపై ఉపాధ్యాయుల నుంచి వివరాలు తీసుకున్నారు. రోజువారీ బోధన ప్రణాళిక, ప్రత్యేక క్లాసులు, రివిజన్ సెషన్లు, పరీక్షా అభ్యాసాలు సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. 100 రోజుల కార్యక్రమం ఉద్దేశ్యం ప్రతి విద్యార్థి పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా చేయడమేనని పేర్కొన్నారు. బలహీన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక శ్రద్ధ చూపాలని, డౌట్ క్లియరింగ్ క్లాసులు, మోడల్ టెస్ట్ పేపర్లు నిర్వహించాలన్నారు. విద్యార్థుల హాజరు శాతం పెంచడంపై దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థులను క్రమశిక్షణతో చదువుకు అలవాటు చేయాలని, తల్లిదండ్రులతో సమన్వయం పెంచి ఇంటివద్ద కూడా చదువు వాతావరణం ఉండేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రభుత్వ కార్యక్రమాలను నిబద్ధతతో అమలు చేస్తే తప్పకుండా మంచి ఫలితాలు వస్తాయని ఎంఈఓ ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు నారపరెడ్డి, సూర్యనారాయణ ఆచారి, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థుల పరీక్ష అభ్యాసాలను
పరిశీలిస్తున్న ఎంఈఓ రమణప్ప

# గ్రామస్థాయిలో టిడిపి బలోపేతానికి కృషి

**టిడిపి నేతలు..**

**అమరాపురం, డిసెంబర్ 16:**
అమరాపురం మండలం తెలుగుదేశం పార్టీ గ్రామస్థాయి లో ప్రతిష్టతకు , అభివృద్ధికి కృషి చేస్తామని మండల కన్వీనర్ కృష్ణమూర్తి ,మండల ప్రధాన కార్యదర్శి నాగరాజు పేర్కొన్నారు. విజయవాడ మంగళగిరి సెంట్రల్ పార్టీ కార్యాలయము నందు సోమవారం , మంగళవారం శిక్షణ కార్యక్రమంలో హాజరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రస్థాయి నాయకులు పార్టీ ఎలా అభివృద్ధి చేయాలో అవగాహన కల్పించారు. ఉత్తరాంధ్ర శాసనమండలి సభ్యులు శ్రీ గంజి చిరంజీవి ,హోం శాఖ మంత్రి శ్రీ వంగలపూడి అనిత , ఎమ్మెల్యే బోడె ప్రసాద్ , ఎమ్మెల్సీ పంచుమర్ది అనురాధ శిక్షణ కార్యక్రమం హాజరైన మండల్ కన్వీనర్లకు , మండల ప్రధాన కార్యదర్శిలకు పార్టీ అభివృద్ధికి తీసుకొన వలసిన అంశాలను వివరించి, తెలుగుదేశం గ్రామస్థాయి నుంచి నాయకులు కార్యకర్తలు సమన్వయంతో. పనిచేసి రాబోవు ఎన్నికల్లో 100% ప్రజల మన్నలను పొందేలా చేద్దామని మండల్ కన్వీనర్ కృష్ణమూర్తి ప్రధాన కార్యదర్శి నాగరాజ్ సూచించారు. రాష్ట్రస్థాయి శిక్షణ కార్యక్రమంలో పార్టీ విధి విధానాలు, ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు ఇంటింటికి చేరేలా చూడాలని సూచించారు. సూపర్ సిక్స్ పథకం గ్రామస్థాయి లో ప్రజలకు తెలియజేయాలని నిరుపేదలకు అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయడంతో 5 రూపాయలకు కడుపునిండా అన్నం దొరుకుతోందని, వాహన మిత్ర, ఆటో మిత్ర పథకం ద్వారా ప్రతి ఏడాదికి 15,000 రూపాయలు అందిస్తున్నట్లు తెలిపారు. దేశం పార్టీ సభ్యత్వం తీసుకున్న వారికి ప్రమాదవశాత్తు మరణిస్తే 2 లక్షల రూపాయలు ఉండేదని దానిని 5 లక్షల రూపాయలకు పెంచినట్లు తెలిపారు. రాబోవు పంచాయతీ ఎన్నికలలో అన్ని స్థానాలలో దేశం పార్టీ మద్దతుదారులను గెలిపించుకోవాలని ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేయాలని శిక్షణ కార్యక్రమంలో తెలిపారు..



మంగళగిరిలో జరిగిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న మండల కన్వీనర్ కృష్ణమూర్తి, మండల ప్రధాన కార్యదర్శి నాగరాజు



తెలుగుదేశంలో కలిసిన మండల కన్వీనర్ కృష్ణమూర్తి, మండల ప్రధాన కార్యదర్శి నాగరాజు

# ఎమ్మెల్యే రాజుకు శుభాకాంక్షలు



**అను స్టూడియో డీలర్ సంఘం ఉపాధ్యక్షులు హనుమంతు..**
**మండల కన్వీనర్ దేవగానపల్లి కృష్ణమూర్తి..**
**మండల ప్రధాన కార్యదర్శి నాగరాజు..**

**అమరాపురం, డిసెంబర్ 16:**
రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు శ్రీ సత్య సాయి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులుగా ఎన్నికైన మడకశిర టిటిడి పాలకమండలి సభ్యులు ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు కు మండల కన్వీనర్ దేవగానపల్లి కృష్ణమూర్తి, మండల ప్రధాన కార్యదర్శి నాగరాజు, అను స్టూడియో, డీలర్ సంఘం ఉపాధ్యక్షుడు హనుమంతు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.



# చలో ఢిల్లీకి తరలిన ఎంఆర్‌పిఎస్ నాయకులు

**రోళ్ల, డిసెంబర్ 16 :**
ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద ఈనెల 17,18 తేదీల్లో ఎం ఆర్ పి ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే ధర్నా కార్యక్రమానికి మండలం నుంచిరాష్ట్ర ఎం ఆర్ పి ఎస్ ప్రచార కార్యదర్శి శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం తరలివెళ్లారు. సుప్రీంకోర్టు 50 శాతం రిజర్వేషన్ నిబంధనలు పార్లమెంట్ లో సవరించి ఎస్ సి, ఎస్ టి, బిసి,మైనారిటీలకు 80 శాతం రిజర్వేషన్ లు అమలు పరచాలి మహిళాలకు 33 శాతం చట్టసభల్లో రిజర్వేషన్ లు అమలు పరచాలని కోరుతూ నిర్వహించే ధర్నా ఈకార్యక్రమానికి నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి అధిక సంఖ్యలో దళిత నాయకులు తరలివెళ్లారు.



చలో ఢిల్లీకి వెళ్తున్న నాయకులు



ప్రత్యేక ట్రైన్‌లో ఢిల్లీకి వెళ్తున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు

# పొదుపు మహిళలకు సబ్సిడీ రుణ పత్రాలు పంపిణీ

**శాసనసభ్యులు కాకర్ల సురేష్..**

**ఉదయగిరి(వింజమూరు) డిసెంబర్ 16**
వరికుంటపాడు మండల పరిధిలోని తూర్పురొంపిదొడ్ల గ్రామంలో మహిళల ఆర్థిక స్వావలంబనకు తోడ్పడేలా డ్వాక్రా సంఘాలకు సబ్సిడీ రుణాల పంపిణీ ద్వారా గ్రామీణ మహిళలకు జీవనోపాధి అవకాశాలు పెంచడం, చిన్నతరహా ,కుటీర పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహం ఇవ్వాలనే లక్ష్యంతో ప్రధానమంత్రి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ పథకం కింద అర్హులైన మల్లిశెట్టి.లక్ష్మీ, మోరం.లక్ష్మమ్మకి స్థానిక యువ నాయకులు మార్నేని రామకృష్ణ ఆధ్వర్యంలో డ్వాక్రా సంఘం అధికారి (ఎ.పి.ఎం) సుధాకర్ సమన్వయంతో రుణాలు మంజూరు చేశారు. ఈ మంజూరైన రుణ పత్రాలను ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ ఓసీ,బీసీ వర్గాలకు చెందిన లబ్ధిదారులకు 25 శాతం సబ్సిడీ, ఎస్సీ ,ఎస్టీ వర్గాల లబ్ధిదారులకు 35 శాతం సబ్సిడీతో ప్రభుత్వ పరంగా అందించబడుతుందని తెలిపారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఈ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. అలాగే స్థానిక నాయకులు, ప్రజలతో సమన్వయం చేసుకుంటూ అర్హులైన లబ్ధిదారులను గుర్తించి, ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. మహిళల అభివృద్ధి ద్వారానే గ్రామాల సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందన్న నమ్మకాన్ని ఆయన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కుండ్ల నరసింహారావు, మద్దినేని తిరుపాలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



రుణపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్



రుణపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్



శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరీ దేవికి
పూలతో అలంకరణ

# ధనుర్మాస పూజలు ప్రారంభం

**అమరాపురం, డిసెంబర్ 16:**
అమరాపురంలో వెలసిప శ్రీ ప్రసన్న లక్ష్మీ వెంకటేశ్వర స్వామి, శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవి దేవస్థానాల్లో మంగళవారం ధనుర్మాస పూజలు ప్రారంభమయ్యాయి. జనవరి 15 వరకు విశేష ధనుర్మాస పూజ మహోత్సవాలు, శ్రీ గోదాదేవి శ్రీ శ్రీనివాస కళ్యాణం, పాంచ రాత్రాంగం శాస్త్ర రీతిగా శ్రీ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు అర్చకులు హరీష్ భట్టాచార్యులు, శ్రీ నరేష్ భట్టాచార్యులు, శ్రీనిధి భట్టాచార్యులు తెలిపారు. ఈనెల 29న, 30న వైకుంఠ ఏకాదశి, ముక్కోటి ద్వాదశి పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ప్రధాన అర్చకులు హరీష్ భట్టాచార్యులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కుబడులు తీర్చుకోవాలని వారు కోరారు.



# రబీ సాగు కోసం విత్తన వేరుశనగ సిద్ధం

**మండల వ్యవసాయ అధికారి అబ్దుల్ హక్..**

**నల్లమాడ, డిసెంబర్ 16:**
రబీలో వ్యవసాయ బోర్ల కింద సాగు చేసే రైతులు విత్తన వేరుశనగ కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలని వ్యవసాయ అధికారి అబ్దుల్ హక్ మంగళవారం పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీలో వేరుశనగ సాగు చేసే రైతుల కోసం ప్రభుత్వం సబ్సిడీతో 30 కిలోల బస్తా రూ. 1656తో అందిస్తోందన్నారు. పట్టాదారు పాసుపుస్తకం ఉన్న రైతులు వారి పంచాయితీల పరిధిలో ని రైతుసేవ కేంద్రాల్లో అగ్రికల్చర్ అసిస్టెంట్ ల వద్ద ఆధార్ నమోదు చేయించుకుని, డబ్బులు చెల్లించి విత్తన వేరుశనగ తీసుకెళ్లచ్చని తెలిపారు. వేరుశనగ సాగులో అత్యధిక దిగుబడుల కోసం వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించడం మంచిదన్నారు.

# చైల్డ్ కేర్ లీవ్‌లో పిల్లల గరిష్ఠ వయసు పరిమితి తొలగించడం హర్షణీయం

**ఒంటేరు శ్రీనివాసులరెడ్డి .**

**ముదిగుబ్బ, డిసెంబర్ 16:**
ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన చైల్డ్ కేర్ లీవ్ కు గరిష్ఠ వయస్సు పరిమితిని తొలగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మహిళా ఉద్యోగులకు గతంలో పిల్లల సంరక్షణ సెలవుల వినియోగానికి సంబంధించి పిల్లల గరిష్ఠ పరిమితి ఉండేదని, అయితే ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఈ పరిమితిని తొలగించి ఉద్యోగులు తమ మొత్తం సేవా కాలంలో, రిటైర్మెంట్‌కు ముందు వరకు చైల్డ్ కేర్ లీవ్‌ను వినియోగించుకోవచ్చని ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. ఉద్యోగులు ఈ సెలవులను పిల్లల సంరక్షణ , పరీక్షల సమయంలో , అనారోగ్య సందర్భాల్లో వినియోగించుకోవచ్చన్నారు.



# రైతులకు విత్తన వేరుశనగ పంపిణీ

**మండట కన్వీనర్ నాగరాజు..**

**రోళ్ల, డిసెంబర్ 16 :**
మడకశిర శాసనసభ్యులు, ఎం యస్ రాజు మాజీ శాసనమండలి సభ్యులు గుండుమల తిప్పేస్వామి ఆదేశాల మేరకు మంగళవారం కల్లుమర్రి రైతు సేవా కేంద్రం నందు 30 బ్యాగులు వేరుశనగను రైతులకు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు నాగరాజు నరసన్న, నారాయణప్ప, మల్లికార్జున,గోవిందప్ప డీలర్ మధుసూదన్ నాగభూషణం అగ్రంపల్లి మారుతి రెడ్డి సదాశివరెడ్డి పెద్ద మూర్తి బజ్జి నారాయణ గౌడ్, ఎన్.మూర్తి రామలింగప్ప గోవిందప్ప రామాంజప్ప తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు



రైతులకు విత్తన వేరుశనగ పంపిణీ చేస్తున్న
మండట కన్వీనర్ నాగరాజు

# శివరాజ్‌కుమార్, ఉపేంద్ర ల 45

కన్నడ అగ్ర నటులు శివ రాజ్‌కుమార్, ఉపేంద్ర ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతున్న మల్టీస్టారర్ చిత్రం '45'. ఈ సినిమా డిసెంబరు 25న ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా.. ఈ సినిమా ట్రైలర్‌ను చిత్రబృందం తాజాగా విడుదల చేసింది. ఈ చిత్రంలో శివ రాజ్‌కుమార్, ఉపేంద్రతో పాటు రాజ్ బి. శెట్టి కూడా ఓ ముఖ్య పాత్ర పోషిస్తున్నాడు. ఈ సినిమా ట్రైలర్‌ను బట్టి చూస్తే.. సినిమా విభిన్నమైన కథాంశంతో, ముఖ్యంగా
వీఎఫ్ఎక్స్ కు అధిక ప్రాధాన్యం ఇస్తూ రూపొందినట్టు స్పష్టమవుతోంది. ఉపేంద్ర తన గత చిత్రాల మాదిరిగానే ఇందులోనూ ఒక డిఫరెంట్, ఛాలెంజింగ్ రోల్‌లో కనిపించనున్నట్లు సమాచారం. ఈ చిత్రం డిసెంబరు 25న క్రిస్మస్ కానుకగా విడుదల కానుండగా తెలుగు ప్రేక్షకుల కోసం ఈ చిత్రాన్ని వారం ఆలస్యంగా, జనవరి 1న కొత్త సంవత్సరం కానుకగా విడుదల చేయనున్నారు.




# నా పెళ్లిపై అసత్య ప్రాచారాలు ఎందుకు



నటి మెహరిన్ ఘాటు వ్యాఖ్యలు
తన పెళ్లి వార్తలపై అసత్య కథనాలపై నటి మెహరిన్ తీవ్రంగా స్పందించారు. తన పెళ్లంటూ ఆర్టికల్ రాసిన ఓ మీడియా సంస్థపై నటి మెహరీన్ అసహనం వ్యక్తంచేశారు. గత రెండేళ్లుగా ఇలాంటి వ్యవహారాలపై మౌనంగా ఉన్నా, ఇప్పుడు మాట్లాడక తప్పడం లేదన్నారు. నేను ఎవరినీ వివాహం చేసుకోలేదు. పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నప్పుడు ప్రపంచానికి చెబుతా.. అంతేగానీ తన పెళ్లి గురించి వదంతులు వ్యాప్తి చేయొద్దని కోరారు. హరియాణాకు చెందిన భవ్యా బిష్ణోయ్‌తో మెహరీన్ నిశ్చితార్థం జరిగినా అనివార్య కారణాల వల్ల పెళ్లి రద్దు అయింది. 2022లో వచ్చిన 'ఎఫ్ 3' తర్వాత ఆమె నటించిన తెలుగు సినిమా 'స్పార్క్'. కోలీవుడ్‌లోనూ ఒక్క సినిమాలోనే (ఇంద్ర) నటించారు. ప్రస్తుతం కన్నడలో ఓ చిత్రం చేస్తున్నారు. కెరీర్‌లో గ్యాప్‌పై ఓ ఇంటర్వ్యూలో స్పందించారు. గ్యాప్ కావాలని తీసుకోలేదని, 'ఎఫ్ 3' తర్వాత చేసిన 'సుల్తాన్ ఆఫ్ దిల్లీ' వెబ్‌సిరీస్ కోసం ఎక్కువ సమయం కేటాయించానని తెలిపారు.

# ఓజి విజయంతో పవన్‌కళ్యాన్ ఖుషి



డైరెక్టర్ సుజిత్‌కు కారు బహుకరణ
పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ అభిమానులు చాలా రోజుల తర్వాత బ్లాక్ బస్టర్ అందుకున్న విషయం తెలిసిందే. చాలా రోజుల తర్వాత పవన్‌కి ఓజీ రూపంలో బ్లాక్ బస్టర్ రావడంతో ఫ్యాన్స్ సంబరాలు చేసుకుంటున్నారు. అయితే 'ఓజీ' చిత్రం బాక్సాఫీస్ వద్ద బ్లాక్ బస్టర్ విజయాన్ని సాధించిన నేపథ్యంలో ఏపీ డిప్యూటీ సీఎం.. నటుడు పవన్ కళ్యాణ్ చిత్ర దర్శకుడు సుజిత్ కు అద్భుతమైన బహుమతిని అందించారు. 'ఓజీ' సాధించిన అద్భుత విజయానికి సంతోషించిన పవన్ కళ్యాణ్, దర్శకుడు సుజిత్‌కు లగ్జరీ కారు ని బహుమతిగా ఇచ్చారు. ప్రముఖ కార్ల కంపెనీ లాండ్ రోవర్‌కి చెందిన రేంజ్ రోవర్ లగ్జరీ కారుని సుజిత్‌కి గిఫ్ట్‌గా ఇచ్చాడు. కాగా ఈ విషయాన్ని సుజిత్ ఎక్స్ వేదికగా పంచుకున్నాడు. నేను అందుకున్న బహుమతుల్లో ఇది అత్యుత్తమమైనది. మాటల్లో చెప్పలేనంత ఆనందంగా, కృతజ్ఞతతో నిండిపోయాను. నా అత్యంత ప్రియమైన ఓజీ, కళ్యాణ్ గారి నుండి లభించిన ఈ ప్రేమ, ప్రోత్సాహం నాకు అన్నిటికంటే ముఖ్యం. చిన్ననాటి నుంచి ఆయన అభిమానిగా మొదలై ఈ ప్రత్యేక క్షణం వరకు? ఇది నిజంగా అద్భుతం. జీవితంలో ఎప్పటికీ ఆయనకు రుణపడి ఉంటాను'. అంటూ సుజిత్ రాసుకోచ్చాడు.

# బార్డర్ -2 టీజర్ విడుదల




1997 నాటి ఐకానిక్ వార్ డ్రామా 'బోర్డర్' చిత్రానికి సీక్వెల్‌గా వస్తున్న చిత్రం 'బోర్డర్ 2'. ఈ సీక్వెల్‌లో సన్నీ డియోల్‌తో పాటు వరుణ్ ధావన్, దిల్‌జిత్ దోసాంజ్, అహన్ శెట్టి కీలక పాత్రల్లో నటిస్తుండగా.. ఈ సినిమాకు అనురాగ్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ చిత్రం రిపబ్లిక్ డే కానుకగా జనవరి 26న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి టీజర్‌ను విడుదల చేసింది చిత్రబృందం.
ఈ టీజర్‌లో బాలీవుడ్ నటుడు సన్నీ డియోల్ తన పాత మేజర్ కుల్‌దీప్ సింగ్ పాత్రలో తిరిగి కనిపించి అభిమానులను ఆకట్టుకున్నారు. మీరు ఆకాశం నుంచో, భూమి నుంచో, సముద్రం నుంచో ఎక్కడి నుంచి చొరబడాలని ప్రయత్నించినా, మీకు ముందు ఒక హిందుస్తానీ సైనికుడు నిలబడి కనిపిస్తాడు. కళ్లలోకి కళ్లు
ఎట్టి, ధైర్యంగా నిలబడి, దమ్ముంటే రండి, ఇదిగో హిందుస్థాన్ ఇక్కడే ఉంది అంటాడు. అంటూ టీజర్‌లో సన్నీ డియోల్ చెప్పిన డైలాగ్ ఆకట్టుకుంటుంది. టీజర్ చివర్లో, సన్నీ డియోల్ తన సైనికులను ఉద్దేశించి మీ నినాదం ఎక్కడిదాకా వినిపించాలి? అని అడగగా, వారు గట్టిగా లాహోర్ దాకా!' అని జవాబివ్వడం హైలైట్‌గా నిలిచింది. ఈ చిత్రం కూడా 1971 ఇండో-పాకిస్తాన్ యుద్ధంలో జరిగిన యథార్థ సంఘటనల ఆధారంగా తెరకెక్కించినట్లు మేకర్స్ తెలిపారు.

# అమెజాన్‌లోకి రష్మిక ధామా మూవీ



మ్యాడ్ డాక్ ఫిలిమ్స్ తెరకెక్కించిన హార్రర్ మూవీస్‌కు సూపర్ క్రేజ్ ఉంటుందని తెలిసిందే. ఇదే జోనర్‌లో రష్మిక మందన్నా, ఆయుష్మాన్ ఖురానా కాంబోలో దీపావళి సీజన్‌లో ఎంట్రీ ఇచ్చిన బాలీవుడ్ చిత్రం థామా . మ్యాడ్‌డాక్ హార్రర్ సినిమాటిక్ యూనివర్స్‌లో భాగంగా వచ్చిన ఈ చిత్రం థియేటర్లలో విడుదలై మిక్స్‌డ్ టాక్ తెచ్చుకుంది. తెలుగులో కూడా డబ్బింగ్ అయిన ఈ చిత్రానికి యావరేజ్ టాక్ వచ్చింది. ఆ తర్వాత థామా పాపులర్ ఓటీటీ ఎ÷-లాట్‌ఫాం అమెజాన్ ప్రైం వీడియోలో ఇటీవలే రెంటల్ బేసిస్‌లో ఎంట్రీ ఇచ్చింది. ఈ చిత్రాన్ని ఇక ఉచితంగా చూసేయొచ్చు. థామా అమెజాన్ సబ్ స్క్రైబర్లకు ఉచితంగా అందుబాటులో ఉంది. హిందీ, తెలుగు ఆడియోతోపాటు ఇంగ్లీష్ సబ్ టైటిల్స్ తో వీక్షించవచ్చు. ఆదిత్య సర్పోట్‌దర్ డైరెక్టర్ చేసిన ఈ చిత్రంలో నవాజుద్దీన్ సిద్దిఖీ, పరేశ్ రావల్ ఇతర కీలక పాత్రల్లో నటించారు. సచిన్-జిగర్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందించారు. మలైకా అరోరా, నోరా ఫతేహి, వరుణ్ ధవన్ కామియో రోల్స్‌లో నటించారు.

# శిల్పాశెట్టి, బాస్టిఇయన్‌పై కేసు



బాలీవుడ్ నటి శిల్పా శెట్టికి చెందిన ప్రముఖ రెస్టారెంట్ 'బాస్టియన్' బెంగళూరులో మరో వివాదంలో చిక్కుకుంది. అనుమతించిన సమయం కంటే ఎక్కువసేపు కార్యకలాపాలు నిర్వహించడంతో పాటు, అర్ధరాత్రి పార్టీలకు అనుమతించి నిబంధనలు ఉల్లంఘించినందుకు గాను బెంగళూరు పోలీసులు ఈ రెస్టారెంట్‌పై కేసు నమోదు చేశారు. సెయింట్ మార్క్స్ రోడ్‌లో ఉన్న 'బాస్టియన్' రెస్టారెంట్ డిసెంబర్ 11న రాత్రి 1.30 గంటల వరకు కార్యకలాపాలు కొనసాగించినట్లు ఆరోపణలు వచ్చాయి. ఇది పోలీసులు ఇచ్చిన సమయానికంటే ఎక్కువ సేపు నిర్వహించినట్లు సమాచారం. దీంతో కర్ణాటక పోలీస్ చట్టంలోని సెక్షన్ 103 కింద సుమోటో ఫిర్యాదుల ఆధారంగా కబ్బన్ పార్క్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. నిబంధనలు ఉల్లంఘించినందుకు మేనేజర్‌లు, ఇతర సిబ్బందిపై కేసులు నమోదు అయ్యాయి. 'బాస్టియన్'తో పాటు, రెసిడెన్సీ రోడ్‌లో ఉన్న 'సౌర్ బెర్రీ పబ్' పై కూడా కేసు నమోదు చేశారు. ఈ దర్యాప్తులో భాగంగా పబ్ సిబ్బందితో సహా ఎనిమిది మంది వాంగ్మూలాలను పోలీసులు రికార్డు చేశారు.

Publisher and Owned by S.BABAJAN, Main Road, Nallamada, ANANTHAPUR, Andhrapradesh-515501. Printed At SUNDAY PRINTING PRESS, SVN Coliny, Gunturu... EDITOR- B.SHANKAR PRASAAD, PRGI No- APTEL/25/A2739 ..Cell No - 99634 96956, 73827 12780.